తెలుగు దినపత్రిక
# సిరి
People's Voice వార్త పత్రిక
RNI TG TEL/ 26/A0381
14-08-2026
శుక్రవారం హైదరాబాద్
సంపుటి: (volume): 1
సంచిక: (ISSUE): 187
PUBLISHED FROM HYDERABAD పేజీలు-8 వెల:రూ.4 /–

తెలుగు దినపత్రిక
సిరి People's Voice వార్తపత్రిక
RNI:TGTEL/26/A0381
siridailynews@gmail.com
/siridailynews
@siridailynews
విలేకరులు కావలెను
ఉన్నత ఆశయంతో ముందుకు పోతున్న సిరి దినపత్రిక లో తెలంగాణలోని అన్ని జిల్లా కేంద్రాలకు స్టాఫ్ రిపోర్టర్స్ తో పాటు, అన్ని జిల్లాలోని నియోజకవర్గ కేంద్రాలకు మరియు మండలాలకు విలేకరులు కావలెను.
99897 78881, 7702344303, 9440451575



## 19న విద్యుత్ సౌధలో
# ఉద్యోగుల మహాధర్నా

- పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆందోళన
- వైటీపీఎస్ కోల్ యాష్ ప్లాంట్ల నిర్వహణ ఔట్‌సోర్సింగ్‌ను వెంటనే ఉపసంహరించుకోవాలి
- పీఆర్సీ 2026 నెగోషియేషన్ కమిటీ ఏర్పాటు చేయాలి
- ఆర్టిజన్లకు బోర్డు సర్వీస్ రూల్స్ అమలు చేయాలి
- టీజీ పవర్ ఎంప్లాయిస్ జేఏసీ

హైదరాబాద్, ఆగస్టు 13 (సిరి న్యూస్):

తెలంగాణ విద్యుత్ సంస్థలైన టీజీ ట్రాన్స్‌కో, జెన్కో, టీజీఎస్పీడీసీఎల్, టీజీఎన్‌పీడీసీఎల్‌లో పనిచేస్తున్న ఉద్యోగులు, ఆర్టిజన్లకు సంబంధించిన పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ పవర్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో 19వ తేదీ బుధవారం ఉదయం 11 గంటలకు విద్యుత్ సౌధలో మహా ధర్నా నిర్వహించనున్నట్లు జేఏసీ నేతలు ప్రకటించారు. ఈ సమావేశంలో జేఏసీ చైర్మన్ సాయిబాబా, కన్వీనర్ రత్నాకర్ రావు, సెక్రెటరీ జనరల్ శ్రీధర్, తాజోదన్ బాబా, వైస్ చైర్మన్ మహేష్, వజీర్ తదితరులు పాల్గొని ఈ నిర్ణయాన్ని

మిగతా 2వ పేజీలో..



## భద్రతా ప్రమాణాలపై
# ప్రత్యేక దృష్టి సారించాలి

2

- పెండింగ్ వర్క్ ఆర్డర్లను ఆగస్టు 20 నాటికి పూర్తి చేయాలి
- లేదంటే కఠిన చర్యలు తప్పదు: సీఎండీ జితేష్ వి. పాటిల్ ఆదేశం




# అంతా మా ఇష్టం!

## నాన్ టీచింగ్ ప్రమోషన్లలో ఇంటర్ బోర్డు ఇష్టారాజ్యం

- ఎప్పుడు పడితే అప్పుడు డీపీసీలు నిర్వహించి కాసుల వేట
- పదేళ్ల పదోన్నతులను సమీక్షిస్తే వెలుగులోకి వాస్తవాలు
- ప్రమోషన్లు పొందిన వారి విద్యార్హతల్లో కొరవడిన జెన్యూనిటీ సర్టిఫికెట్లు
- దూరవిద్యలో పొందిన అక్రమ పట్టాలతో పదోన్నతులు
- ఏ ప్రభుత్వ శాఖలో లేని అడ్డగోలు నిర్ణయాలు ఇంటర్ బోర్డులో ప్రత్యక్షం

3

తెలంగాణ ఇంటర్మీడియట్ బోర్డులో ఆ శాఖ నిర్ణయాలు నిబంధనలకు అనుకూలంగా కాకుండా, అక్కడి పరిస్థితులకు అనుగుణంగా జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఎప్పుడు ఎవరికి ఏమి కావాలన్నా లభించేలా నిబంధనలను సైతం పక్కనపెట్టి ప్రమోషన్లు సైతం ఇచ్చినట్టు తెలుస్తోంది.




## ఓటుకు నోటు కేసు మళ్లీ మొదటికి..

- సుప్రీంకోర్టులో మరోసారి విచారణకు రంగం సిద్ధం
- గతంలో వాదనలు విన్న న్యాయమూర్తులకు పదవీ విరమణ
- కొత్త ధర్మాసనం ముందు పూర్తిస్థాయి వాదనలు
- పాత వాదనలను పరిగణనలోకి తీసుకోలేమన్న సీజేఐ
- రాజకీయ వర్గాల్లో మళ్లీ పెరిగిన ఆసక్తి



2

## డిప్యూటీ సీఎం భట్టికి ఘన స్వాగతం

- ఎయిర్‌పోర్టుకు తరలివచ్చిన ఎమ్మెల్యేలు, నేతలు
- గజమాలతో అభిమానం చాటుకున్న రంగారెడ్డి అధ్యక్షుడు చల్లా

3



## స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీకి రంగం సిద్ధం

- కొత్త కార్డుల మోడల్ విడుదల
- ఈ నెల 15 నుంచి 15 రోజుల పాటు పంపిణీ
- భద్రత కోసం హోలోగ్రామ్, క్యూఆర్ కోడ్
- కార్డుపై కుటుంబ వివరాలు, చిరునామా
- రేషన్ పంపిణీలో పారదర్శకతే లక్ష్యం

2






## గందరగోళంలో వర్షా కాల సమావేశాలు..

- బీజేపీ, విపక్షాల పోటాపోటీ నిరసనలు
- చివరి రోజూ కొనసాగిన రాజకీయ ఘర్షణ

4



## ఢిల్లీ పేలుళ్ల వెనుక అల్‌ఖైదా అనుబంధ సంస్థ

4

## రాష్ట్రాన్ని దోచుకోవడంలో
# బీఆర్ఎస్‌తో పోటీ

- కాంగ్రెస్ తీరుపై మండిపడ్డ ఎంపీ రఘునందన్ రావు
- యూనిటీమాల్ ఒప్పందాలపై విచారణ జరగాలని డిమాండ్



న్యూఢిల్లీ, ఆగస్టు 13:

రాష్ట్రంలో ప్రజల సొమ్ము దోచుకోవడంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ లు పోటీ పడుతున్నాయని బీజేపీ ఎంపీ రఘునందన్ రావు

మిగతా 2వ పేజీలో..

## ఫిరాయింపు ఎమ్మెల్యేలపై..
# హైకోర్టులో వాదనలు

- స్పీకర్ తీర్పును సవాలు చేస్తూ పిటిషన్లు
- 10 మంది ఎమ్మెల్యేలపై అనర్హత వేటు కోరుతూ విచారణ
- స్పీకర్ పరిధి దాటారని పిటిషనర్ల వాదన

3

## నాడు ఉపన్యాసాలు..
# నేడు భూ అమ్మకాలు

- వేలం వెర్రిగా సర్కారు భూముల అమ్మకాలు
- నాడు కోర్టుకు వెళ్లి నేడు అడ్డగోలుగా అమ్ముకుంటావా?
- రాయదుర్గం హెరిటేజ్ భూ వేలాన్ని వెంటనే ఆపాలి
- సీఎంకు హరీష్ రావు లేఖ

2





## ఈసీఐ పేరుతో
# ఫేక్ మెసేజ్‌లు

హైదరాబాద్ ,ఆగస్టు 13, (సిరి న్యూస్):

ఈసీఐ పేరుతో ఓటర్లకు మోసపూరిత సందేశాలను సైబర్ మోసగాళ్లు పంపిస్తున్నారని తెలంగాణ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్

మిగతా 3వ పేజీలో..



## పిల్లల ఆరోగ్యంతో ఆటలొద్దు

4

- ఆహార పదార్థాల ప్యాకెట్లపై లేబుల్ వేయాల్సిందే
- మీతో కాకపోతే మేమే ఆ పని చేస్తాం
- కేంద్రానికి సుప్రీం కోర్టు చురకలు



## ప్రతిష్ఠాత్మకంగా 'ఖేలో ఇండియా' నిర్వహణ

- కేంద్ర మంత్రి మాండవీయతో వాకిటి

3

# నాడు ఉపన్యాసాలు.. నేడు భూ అమ్మకాలు

**హైదరాబాద్, ఆగస్టు 13, (సిరి న్యూస్):** రాష్ట్రంలో వేలం వెర్రిగా ప్రభుత్వ భూముల అమ్మకాలు చేస్తున్నారంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై బీఆర్ఎస్ నేత టి.హరీష్‌రావు తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఎక్కడ ప్రభుత్వ భూములు కనిపిస్తే అక్కడ అమ్మకాలేనా అంటూ ప్రశ్నించారు. ఈమేరకు సీఎంకు ఓ లేఖ రాశారు. నాడు పీసీసీ అధ్యక్షుడిగా ప్రభుత్వ భూములు పెద్దలు ఇచ్చిన జాతి సంపద అని ఉపన్యాసాలు దంచిన నువ్వు నేడు ప్రజల ఆస్తులను అమ్మకానికి పెడుతున్నావంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. కంచ గచ్చిబౌలి, లగచర్ల, మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ, నేడు రాయదుర్గ్ ఇలా ఎక్కడికక్కడ భూములు అమ్మే కుట్రలు చేస్తుండటం సిగ్గుచేటని అని అన్నారు. జీవో ఎంఎస్ నెం.4 ద్వారా రాయదుర్గ్ పన్మక్త గ్రామంలోని సర్వే నం.83ను హెరిటేజ్ సైట్‌గా గుర్తించినట్లు రికార్డులు స్పష్టం చేస్తున్నాయన్నారు. హెరిటేజ్ భూములను కాపాడాల్సిన ప్రభుత్వం వాటినే వేలం వేయడం ఏమిటని నిలదీశారు. 2020లో ఇదే భూములపై రక్షణ కోరుతూ రేవంత్ కోర్టు మెట్లు ఎక్కారని గుర్తుచేశారు. ప్రతిపక్షంలో ఉండగా ఒక మాట.. అధికారంలోకి వచ్చాక మరో మాటనా అని ప్రశ్నించారు. ఇదే సర్వే నంబరులో గతంలో 6.2 ఎకరాలు ఎకరాకు సుమారు రూ.237 కోట్ల చొప్పున వేలం వేస్తే ఎస్‌బీఐ కోర్టుకు ఎక్కిందని, ప్రస్తుతం ఈ అంశం హైకోర్టు పరిధిలో ఉందని వెల్లడించారు. అయినా మరో 10.63 ఎకరాలను వేలం వేయడం వెనుక ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. న్యాయ వ్యవస్థ అంటే గౌరవం లేదా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ భూమిపై అనేక వివాదాలు ఉన్నాయంటూ భూమి ఎవరిదో తేల్చలేని ప్రభుత్వం భూమిని అమ్మడానికి ఎందుకు తొందరపడుతోందని నిలదీశారు. రూ.2,000 కోట్ల విలువైన హెరిటేజ్ భూములను అమ్మే హక్కు కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎవరు ఇచ్చారంటూ మండిపడ్డారు. ఇంచు ప్రభుత్వ భూమిని కూడా అమ్మబోము అన్న హామీ ఏమైందని అడిగారు. అసెంబ్లీ సాక్షిగా ప్రభుత్వ భూములను అమ్మబోమని చెప్పిన రెవెన్యూ మంత్రి మాటలకు విలువ లేదా అని ప్రశ్నించారు. సుప్రీంకోర్టు కూడా ఆస్తిని పరిరక్షించడం, కొత్తగా థర్డ్ పార్టీ ఇంటరెస్ట్ సృష్టించకుండా చూడాల్సిన అవసరాన్ని స్పష్టం చేసిందని హరీశ్ గుర్తుచేశారు. ఈ పరిస్థితుల్లో వివాదాస్పద భూమిని వేలం వేసి కొత్త హక్కులు సృష్టించడం ఏ విధమైన పరిపాలనా బాధ్యత అని ప్రశ్నించారు. ఈనెల 17, 21 తేదీల్లో జరపనున్న వేలాన్ని నిలిపివేయాలని డిమాండ్ చేశారు. సర్వే నం.83కు సంబంధించిన హెరిటేజ్, రెవెన్యూ, సర్వే, వక్ఫ్ రికార్డులన్నింటినీ బయటకు తీసి సమగ్రంగా విచారణ జరిపి, వాస్తవాలు నిగ్గు తేల్చాలన్నారు. హక్కులు, వివాదాలు తేలకముందే ఈ భూములను కొనుగోలు చేస్తే భవిష్యత్తులో న్యాయపరమైన సమస్యలు తప్పవని హెచ్చరించారు. రియల్ ఎస్టేట్ వ్యాపారిలా కాక ముఖ్యమంత్రిగా వ్యవహరించాలని హితవు పలికారు. అనుముల బ్రదర్స్ ప్రయోజనాల కోసం కాదని, అన్ని వర్గాల ప్రజల సంక్షేమం, రాష్ట్ర ప్రయోజనాలను కాపాడే ముఖ్యమంత్రిగా ఉండాలని, లేదంటే చరిత్ర హీనుడిగా మిగిలిపోతావని హరీశ్ రావు హెచ్చరించారు.

# పంద్రాగస్టు ఏర్పాట్లు పక్కాగా ఉండాలి

**హైదరాబాద్, ఆగస్టు 13, (సిరి న్యూస్):** పంద్రాగస్టు వేడుకల ఏర్పాట్లను వేగవంతంగా పూర్తి చేయాలని రవాణా, ఆర్ అండ్ బి శాఖల స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్ అధికారులను ఆదేశించారు. గోల్కొండ కోటలో శనివారం నిర్వహించనున్న స్వాతంత్ర్య దిన వేడుకలు జరిగే ప్రాంతాన్ని గురువారం సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో కలిసి ఆయన గురువారం పరిశీలించారు. అందరూ సమన్వయంతో పనిచేయాలంటూ శాఖల వారీగా ఏర్పాట్లపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. వర్షాకాలం నేపథ్యంలో కార్యక్రమంలో ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా వాటర్‌ప్రూఫ్ షామియానాలు, వాటర్‌ప్రూఫ్ జనరేటర్, నిరంతర విద్యుత్ సరఫరా, తాగునీరు, బ్యారికేడింగ్, గ్యాలరీలు, అతిథులు, విద్యార్థులు, ప్రజల సీటింగ్ సామర్థ్యం, సౌండ్ సిస్టమ్ తదితర ఏర్పాట్లను సమీక్షించారు. కార్యక్రమ నిర్వహణలో ఎక్కడా ప్రొటోకాల్‌కు ఇబ్బంది కలగకుండా అధికారులు నిబద్ధతతో వ్యవహరించాలని ఆయన సూచించారు. అదేవిధంగా స్టేజీ ఏర్పాటుతోపాటు సుందరీకరణ పనులను వేగవంతంగా చేపట్టాలని సూచించారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పాల్గొంటున్నందున ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. పిల్లలు వచ్చే ప్రతి వాహనంలో ఒక లైజనింగ్ అధికారి తప్పనిసరిగా ఉండేలా చూడాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. పంద్రాగస్టు వేడుకలకు ముఖ్యమంత్రి, మంత్రులు, ప్రముఖులు, ప్రజాప్రతినిధులు హాజరుకానున్న నేపథ్యంలో ఏర్పాట్లు ఘనంగా ఉండాలని, ఎక్కడా ఎలాంటి సమస్యలు తలెత్తకుండా పక్కాగా, వేగవంతంగా ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆయన సూచించారు. ముఖ్యమంత్రికి సమర్పించే పోలీసుల గౌరవ వందనం, పోలీస్ కవాతును ఆయన ఉన్నతాధికారులతో కలిసి వీక్షించారు. కార్యక్రమంలో మైనారిటీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అహ్మద్ నదీమ్, సమాచార శాఖ కమిషనర్ జి.ముకుంద రెడ్డి, అడిషనల్ డీజీపీ సంజయ్ కుమార్ జైన్, స్వాతి లక్రా, సీపీ సజ్జనార్, అడిషనల్ సీపీ తఫ్సీర్ ఇక్బాల్, ట్రాఫిక్ జాయింట్ సీపీ జోయల్ డేవిస్, ఇంటెలిజెన్స్ ఓఎస్డీ కమలాసన్ రెడ్డి, అడిషనల్ కలెక్టర్ జితేందర్ రెడ్డి, సమాచార శాఖ అడిషనల్ డైరెక్టర్ డి.ఎస్.జగన్, చీఫ్ ఇంజనీర్ రాధాకిషన్, రీజినల్ ఇన్ఫర్మేషన్ ఇంజనీర్ జయరామమూర్తి, ఆర్ అండ్ బి చీఫ్ ఇంజనీర్ రాజేశ్వర్ రెడ్డి, ఫైర్ ఆఫీసర్ వెంకన్న, ఆర్డీవో రామకృష్ణ, డీఈఓ యాదయ్య, ఆర్ అండ్ బి, విద్యుత్, వైద్య, జీహెచ్ఎంసీ, వాటర్ వర్క్స్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# రాష్ట్రాన్ని దోచుకోవడంలో బీఆర్ఎస్‌తో పోటీ

**మొదటిపేజీ తరువాయి**

ఆరోపించారు. బీఆర్ఎస్ పదేళ్ల అవినీతిని మించి కాంగ్రెస్ దోచుకోవాలని చూస్తోందని విమర్శించారు. ఈ రెండు పార్టీలు నాణెనికి ఇరువైపులా ఉన్నటువంటివని పేర్కొన్నారు. యూనిటీ మాల్ పేరుతో జరిగిన ఒప్పందంపై సమగ్ర విచారణ జరపాలని ఎంపీ డిమాండ్ చేశారు. కేంద్రం ఇచ్చిన రూ.202 కోట్లతో యూనిటీ మాల్ నిర్మించాలని నిర్ణయించారన్నారు. అందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆరు ఎకరాలకుపైగా భూమి ఇచ్చిందన్నారు. అయితే ఈ ఒప్పందంలో అవినీతి జరిగిందన్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపణలపై విచారణ జరగాలని ఎంపీ రఘునందన్ రావు డిమాండ్ చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పరస్పరం ఆరోపణలు చేసుకుంటూ ప్రజల దృష్టిని మళ్లిస్తున్నాయని విమర్శించారు. వీళ్లిద్దరూ అవినీతిలో అన్నదమ్ములంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ ప్రభుత్వం రావాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. హైదరాబాద్‌లో భూముల విలువ ఎకరాకు వందల కోట్లకు చేరిందని, ప్రజల ఆస్తులను విక్రయించే హక్కు ప్రభుత్వాలకు లేదని ఎంపీ తేల్చి చెప్పారు. ప్రజల ఆస్తులకు ప్రభుత్వాలు కస్టోడియన్లుగా ఉండాలన్నారు. కేటీఆర్ తప్పు చేస్తే విచారణ జరిగినప్పుడు కాంగ్రెస్ తప్పు చేస్తే విచారణ ఎందుకు ఉండకూడదని ప్రశ్నించారు. 2018లో బీఆర్ఎస్ హయాంలో 10 ఎకరాల భూమిని ప్రైవేట్ సంస్థకు కేటాయించారని, దానిపైనా విచారణ జరగాలన్నారు. ఈ రెండు భూకేటాయింపు ఒప్పందాలపై సమదృష్టితో దర్యాప్తు జరపాలని రఘునందన్ డిమాండ్ చేశారు. యూనిటీ మాల్, బీఆర్ఎస్ భూకేటాయింపులపై కేంద్ర దర్యాప్తు సంస్థలతో విచారణ కోరుతూ కేంద్ర విజిలెన్స్ కమిషన్‌కు ఫిర్యాదు చేస్తున్నట్లు ఎంపీ చెప్పారు. అలాగే, కాళేశ్వరం ప్రాజెక్టుపై డీపీఆర్ నుంచి చివరి చెల్లింపు వరకు సీబీఐ విచారణ జరపాలన్నారు. కేవలం మూడు బ్యారేజీలపై కాక మొత్తం ప్రాజెక్టుపై దర్యాప్తు జరిపించాలని కేంద్రానికి సీఎం రేవంత్ రెడ్డి లేఖ రాయాలని ఎంపీ సూచించారు. దానిపై కేంద్ర హోంమంత్రిని కలిసి దర్యాప్తు జరిగేలా కృషి చేస్తానన్నారు. మరోవైపు రింగ్ రోడ్డు, ఫార్ములా ఈ రేస్, కాళేశ్వరం అంశాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం మాట మార్చిందని ఎంపీ మండిపడ్డారు.

# భద్రతా ప్రమాణాలపై ప్రత్యేక దృష్టి సారించాలి

- పెండింగ్ వర్క్ ఆర్డర్లను ఆగస్టు 20 నాటికి పూర్తి చేయాలి
- లేదంటే కఠిన చర్యలు తప్పదు
- సీఎండీ జితేష్ వి. పాటిల్ ఆదేశం
- అన్ని ఆపరేషన్ సర్కిళ్ల పనితీరుపై వీడియో కాన్ఫరెన్స్




**హైదరాబాద్, ఆగస్టు 13 (సిరి న్యూస్):** టీజీఎస్పీడీసీఎల్ పరిధిలోని అన్ని ఆపరేషన్ సర్కిళ్లలో విద్యుత్ ఉద్యోగులు భద్రతా ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకోవాలని, అందుకు అనుగుణంగా క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ జరపాలని టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ జితేష్ వి. పాటిల్ అధికారులను ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వివిధ సర్కిళ్ల అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. వినియోగదారులకు నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ సరఫరా అందించడం సంస్థ ప్రధాన లక్ష్యమని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ప్రతి సర్కిల్‌లో పనితీరు మెరుగుపరచడంతో పాటు ఆదాయ వసూళ్లు, భద్రతా ప్రమాణాల అమలు, ఫీడర్ అంతరాయాల తగ్గింపు, పెండింగ్ పనుల పూర్తి విషయంలో అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ప్రతి సర్కిల్‌లో పనితీరు కనీసం 80 శాతం ఉండేలా చర్యలు తీసుకోవాలని, లక్ష్యాలకు వెనుకబడిన సర్కిళ్లు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలు రూపొందించి రోజువారీ పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. బకాయిల వసూళ్లలో ఎలాంటి అలసత్వం ప్రదర్శించరాదని, ప్రత్యేక డ్రైవ్‌ల ద్వారా లక్ష్యాలను పూర్తిస్థాయిలో సాధించాలని ఆదేశించారు. మహబూబ్‌నగర్ జిల్లాలో విజయవంతంగా అమలు చేసిన మిడ్జిల్ మోడల్ సబ్‌స్టేషన్ తరహాలో అన్ని సర్కిళ్లలో కనీసం ఒక సబ్‌స్టేషన్‌ను అభివృద్ధి చేయాలని సూచించిన సీఎండీ.. పరిశుభ్రత, భద్రత, హరితవనం, ఆధునికీకరణకు ప్రాధాన్యం ఇవ్వాలని తెలిపారు. సబ్‌స్టేషన్లలో సీసీ కెమెరాలు, రిమోట్ ఆపరేషన్, ఆటో రీక్లోజర్ వంటి ఆధునిక సాంకేతిక సదుపాయాలను విస్తరించాలని ఆదేశించారు. ప్రతి సర్కిల్‌లో యాక్సిడెంట్ ఫ్రీ యాక్షన్ ప్లాన్ రూపొందించి అమలు చేయాలని, గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ భద్రతపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.

**రాజేంద్రనగర్ సర్కిల్‌లో ఆకస్మిక తనిఖీ**

వీడియో కాన్ఫరెన్స్ సమీక్ష అనంతరం, క్షేత్రస్థాయిలో పనితీరును పరిశీలించేందుకు సీఎండీ జితేష్ వి. పాటిల్ రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని నానల్‌నగర్ కార్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించి ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేంద్రనగర్ సర్కిల్‌లో డీటీఆర్ వైఫల్యాలు, విద్యుత్ అంతరాయాలు, రెవెన్యూ వసూళ్లు, కొత్త విద్యుత్ కనెక్షన్లు, పెండింగ్ వర్క్ ఆర్డర్లు, వినియోగదారుల ఫిర్యాదుల పరిష్కారం వంటి అంశాలపై సమగ్రంగా సమీక్షించారు. ఎల్‌టీ మరియు ఇతర కేటగిరీలకు సంబంధించిన కొత్త సేవల దరఖాస్తులు పెండింగ్‌లో ఉండకుండా వెంటనే పరిష్కరించాలని సూచించారు. అపార్ట్‌మెంట్లు మరియు గేటెడ్ కమ్యూనిటీల్లో కామన్ సర్వీసులకు సింగిల్ కనెక్షన్ విధానాన్ని అమలు చేసి పెండింగ్ అంశాలను పరిష్కరించాలని ఆదేశించారు. భవిష్యత్తులో ఏ సమయంలోనైనా ఏ సర్కిల్, డివిజన్ లేదా సెక్షన్‌నైనా ఆకస్మికంగా తనిఖీ చేస్తానని, క్షేత్రస్థాయిలో పనితీరు ఆధారంగానే అధికారుల పనిని అంచనా వేస్తామని తెలిపారు. సమీక్ష సందర్భంగా పనితీరు అంశాలను పరిశీలించిన అనంతరం, రాజేంద్రనగర్ సర్కిల్‌లో ఏఈగా విధులు నిర్వహిస్తున్న దుర్గాప్రసాద్‌ను వికారాబాద్ సర్కిల్ పరిధిలోని దోమ సెక్షన్‌కు బదిలీ చేస్తున్నట్లు ప్రకటించారు. విధుల నిర్వహణలో అలసత్వం ప్రదర్శించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



# 19న విద్యుత్ సౌధలో ఉద్యోగుల మహాధర్నా

**మొదటిపేజీ తరువాయి**

వెల్లడించారు. తెలంగాణలోని విద్యుత్ సంస్థల ఉద్యోగుల సమస్యలపై చర్చించి పరిష్కరించేందుకు గతేడాది జూన్ 18న యాజమాన్యానికి వినతి పత్రం సమర్పించి, ఉమ్మడి సమావేశం నిర్వహించాలని జేఏసీ కోరింది. ఆ తర్వాత పలు దఫాలుగా నిరసన కార్యక్రమాలకు సంబంధించిన నోటీసులు కూడా అందజేసినప్పటికీ, ఇప్పటివరకు ఉద్యోగులు, ఆర్టిజన్లు లేవనెత్తిన సమస్యలపై యాజమాన్యం ఎటువంటి సమావేశాన్ని నిర్వహించకపోవడం పట్ల జేఏసీ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ప్రధానంగా యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ లోని కోల్ యాష్ ప్లాంట్ల నిర్వహణను ఔట్‌సోర్సింగ్ చేయడాన్ని వ్యతిరేకిస్తూ ఉద్యోగులు 40 రోజులకు పైగా ఆందోళనలు చేస్తున్నా పట్టించుకోకపోవడంపై ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల జేఏసీ నేతలు ట్రాన్స్‌కో సీఎండీ కృష్ణ భాస్కర్ గారిని కలిసి వినతి పత్రం అందజేశారు. యాజమాన్యం ఏకపక్ష వైఖరిని వీడి, ఉద్యోగుల ఆందోళనలను గుర్తించి సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఆగస్టు 19న నిర్వహించనున్న మహా ధర్నాలో ఉద్యోగులు, ఆర్టిజన్లు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అయితే, జేఏసీ ఎల్లప్పుడూ చర్చలకు సిద్ధంగా ఉందని, యాజమాన్యం వెంటనే ఉమ్మడి సమావేశాన్ని ఏర్పాటు చేసి సామరస్యపూర్వక పరిష్కారం కోసం చొరవ చూపాలని తెలంగాణ పవర్ ఎంప్లాయిస్ జేఏసీ స్పష్టం చేసింది.

**ప్రధాన డిమాండ్లు ఇవే..**

- ఉద్యోగులు, ఆర్టిజన్లు మరియు పెన్షనర్ల కోసం పీఆర్సీ 2026 నెగోషియేషన్ కమిటీని ఏర్పాటు చేయాలి
- వైటీపీఎస్ కార్యకలాపాల ఔట్‌సోర్సింగ్‌ను తక్షణమే ఉపసంహరించుకోవాలి
- ఆర్టిజన్లకు బోర్డు సర్వీస్ రూల్స్ అమలు చేయడంతో పాటు, అన్‌మ్యాన్డ్ డిస్ట్రిబ్యూషన్ వర్కర్లను ఆర్టిజన్లుగా గుర్తించాలి
- 1999 నుంచి 2004 మధ్య నియమితులైన ఉద్యోగులకు జీపీఎఫ్ మరియు పెన్షన్ సౌకర్యం కల్పించాలి
- అన్ని కేడర్లలో ఖాళీలను భర్తీ చేసేందుకు నూతన నియామకాలు చేపట్టాలి
- మహారాష్ట్ర నమూనాలో రైతు డిస్కం ఏర్పాటు చేయాలి
- ఈపీఎఫ్ ఉద్యోగులకు ఎలాంటి సీలింగ్ లేకుండా యాజమాన్య వాటా చెల్లించాలి
- అన్ని కేడర్లలో ఉద్యోగులకు రెగ్యులర్ ప్రమోషన్లు కల్పించాలి
- ట్రాన్స్‌కో, డిస్కామ్‌లలో సబ్‌స్టేషన్ల షిఫ్ట్ ఆపరేషన్ కోసం అవసరమైన పోస్టులు మంజూరు చేసి భర్తీ చేయాలి
- ఈపీఎఫ్ రిటైర్డ్ ఉద్యోగులకు జీపీఎఫ్ పెన్షనర్లతో సమానంగా వైద్య సౌకర్యాలు కల్పించాలి
- జనరల్ ట్రాన్స్‌ఫర్ పాలసీని పారదర్శకంగా అమలు చేయాలి
- రాష్ట్ర విద్యుత్ అవసరాలకు అనుగుణంగా జెన్కో ద్వారా విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచాలి

# మైనారిటీ రిజర్వేషన్లు కల్పించిన ఘనత కాంగ్రెస్‌దే

**హైదరాబాద్, (సిరి న్యూస్):** ముస్లిం మైనారిటీ రిజర్వేషన్లు అడ్డుకునేందుకు కొన్ని రాజకీయ పార్టీలు ప్రయత్నిస్తున్నాయని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. ముస్లింలకు కాంగ్రెస్ 4 శాతం రిజర్వేషన్లు కల్పించిందని, వీటిని అడ్డుకునేందుకు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. రిజర్వేషన్లరద్దు కోసం అత్యున్నత న్యాయస్థానాల వరకూ వెళ్లారని ముఖ్యమంత్రి విమర్శించారు. అయినా చిత్తశుద్ధితో కాంగ్రెస్ అమలు చేసిందన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మైనారిటీల ప్రతిభా సదస్సుకు సీఎం రేవంత్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పలు రంగాల్లో ప్రతిభ కనబరిచిన పలువురు మైనారిటీలకు అవార్డులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. మైనారిటీ రిజర్వేషన్లకు ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా వ్యతిరేకమని అన్నారు. కాంగ్రెస్ పార్టీ, సోనియా గాంధీ నేతృత్వంలోనే మైనారిటీలకు సంక్షేమం అందుతోందని చెప్పారు. కాంగ్రెస్ అంటేనే సెక్యులర్ పార్టీ అని, హిందూ, ముస్లింలను రెండుకళ్లలా చూస్తోందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వంపైనా ముఖ్యమంత్రి విమర్శలు గుప్పించారు. గత ప్రభుత్వం గ్రూప్ 1 పరీక్షలను నిర్వహించలేకపోయిందని ఎద్దేవా చేశారు. ఓ ఆర్ఎంపీ డాక్టర్‌ను టీజీపీఎస్సీ సభ్యుడిగా నియమించారని సీఎం ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ ఉన్నంతకాలం దేశంలో సెక్యులర్ వర్గాలకు మనుగడ ఉంటుందని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. హిందూ, ముస్లింలను రెండు కళ్లలా కాంగ్రెస్ చూస్తోందని చెప్పారు. నగరంలోని కొమురం భీమ్ ఆదివాసీ భవన్‌లో మైనారిటీస్ ఎక్సలెన్స్ సమ్మిట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు అజారుద్దీన్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్‌తో కలిసి సీఎం పాల్గొన్నారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడారు. రాష్ట్రంలో మైనార్టీలకు 4 శాతం రిజర్వేషన్లను కాంగ్రెస్ ఇచ్చింది. వాటిని రద్దు చేయాలని కొందరు హైకోర్టు, సుప్రీంకోర్టును ఆశ్రయించారు. గుజరాత్‌లో మైనార్టీ రిజర్వేషన్లు రద్దు చేసి చూపాలని సవాల్ విసిరాం. లౌకిక వర్గాల కోసం కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ పోరాడుతుంది. బాక్సింగ్ క్రీడాకారిణి నిఖత్ జరీన్‌కు గ్రూప్ 1 ఉద్యోగం, రూ.3కోట్ల ప్రోత్సాహకం ఇచ్చాం. బీఆర్ఎస్ హయాంలో గ్రూప్ 1 నియామకాల ఊసే లేదు. ఒకసారి నియామకాలు చేపట్టినా పల్లీ, బఠానీల్లా ప్రశ్నపత్రాలు అమ్మారు. మా ప్రభుత్వం వచ్చాక టీజీపీఎస్సీని ప్రక్షాళన చేశాం. అందులో విద్యావంతులను నియమించాం.

# ఓటుకు నోటు కేసు మళ్లీ మొదటికి..

**న్యూఢిల్లీ, ఆగస్టు 14, (సిరి న్యూస్):** తెలుగు రాష్ట్రాల రాజకీయాల్లో సంచలనం రేపిన ఓటుకు నోటు కేసు విచారణ సుప్రీం కోర్టులో మళ్లీ మొదటి దశకు చేరుకుంది. గతంలో ఈ కేసుపై సుదీర్ఘంగా వాదనలు విన్న ధర్మాసనం తీర్పును రిజర్వ్ చేసింది. అయితే ఆ బెంచ్‌లోని న్యాయమూర్తులు పదవీ విరమణ చేయడంతో, న్యాయ నిబంధనల ప్రకారం కొత్త ధర్మాసనం ముందు కేసును తిరిగి విచారించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ విషయాన్ని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ స్పష్టం చేశారు.

**కొత్త ధర్మాసనం ముందుకు..**

పదేళ్ల క్రితం తెలుగు రాష్ట్రాల్లో తీవ్ర రాజకీయ ప్రకంపనలు సృష్టించిన ఓటుకు నోటు కేసుకు సంబంధించిన పిటిషన్లపై సుప్రీంకోర్టులో గతంలోనే విస్తృతంగా వాదనలు జరిగాయి. అయితే వాదనలు విన్న న్యాయమూర్తులు పదవీ విరమణ చేయడంతో విచారణ ప్రక్రియ పూర్తికాకుండానే నిలిచిపోయింది. కేసుల కేటాయింపు ప్రక్రియలో భాగంగా ఈ వ్యవహారం సీజేఐ ముందుకు రావడంతో పాత వాదనలను కొనసాగించే అవకాశం లేదని ధర్మాసనం స్పష్టం చేసింది.

**మొదటి నుంచే వాదనలు..**

కొత్త బెంచ్ ఏర్పాటైన తర్వాత పిటిషనర్లు, ప్రతివాదుల తరఫు న్యాయవాదులు తమ వాదనలను మరోసారి వినిపించాల్సి ఉంటుంది. గతంలో సమర్పించిన వాదనలు, న్యాయపరమైన అంశాలను కొత్త ధర్మాసనం స్వయంగా పరిశీలించాల్సి ఉంటుంది. దీంతో కేసు విచారణ మరోసారి పూర్తిస్థాయిలో ప్రారంభం కానుంది.



**రాజకీయ ప్రాధాన్యంతో..**

ఓటుకు నోటు కేసు రెండు తెలుగు రాష్ట్రాల రాజకీయాల్లో కీలకంగా మారిన నేపథ్యంలో సుప్రీంకోర్టు తాజా పరిణామం ప్రాధాన్యం సంతరించుకుంది. ఇన్నాళ్లుగా న్యాయపరమైన ప్రక్రియలో పెద్దగా కదలిక లేకపోవడంతో ఈ కేసుపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి తగ్గినప్పటికీ, తాజా పరిణామంతో మళ్లీ చర్చ మొదలైంది.

**తీర్పు కోసం మరింత సమయం..**

గతంలో వాదనలు పూర్తయినప్పటికీ కొత్త ధర్మాసనం ఏర్పాటు కావడంతో తీర్పు దశకు చేరిన కేసు మళ్లీ విచారణ దశకు వచ్చింది. కొత్త బెంచ్ ఎప్పుడు ఏర్పాటు అవుతుంది, విచారణను ఏ విధంగా కొనసాగిస్తుంది అన్నదానిపై ఇప్పుడు ఆసక్తి నెలకొంది. దీంతో ఓటుకు నోటు కేసు భవిష్యత్ పరిణామాలపై తెలుగు రాష్ట్రాల రాజకీయ వర్గాలు ఉత్కంఠగా ఎదురుచూస్తున్నాయి.

# స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీకి రంగం సిద్ధం

**హైదరాబాద్, ఆగస్టు 13, (సిరి న్యూస్):** రాష్ట్ర ప్రభుత్వం కొత్త స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీకి సిద్ధమైంది. ఈ నెల 15 నుంచి 15 రోజుల పాటు లబ్ధిదారులకు కొత్త కార్డులను అందించనుంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం స్మార్ట్ రేషన్ కార్డు నమూనాను విడుదల చేసింది. ఆధునిక రూపకల్పనతో రూపొందించిన కార్డులో భద్రతతో పాటు కుటుంబానికి సంబంధించిన కీలక సమాచారాన్ని పొందుపరిచారు.

**కార్డుపై కీలక వివరాలు**

స్మార్ట్ రేషన్ కార్డు ముందు భాగంలో సీఎం రేవంత్ రెడ్డి, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చిత్రాలు ఉంటాయి. రేషన్ కార్డు నంబర్, కుటుంబ యజమాని పేరు, రేషన్ షాపు నంబర్ వంటి వివరాలను ముద్రించారు.

**వెనుక భాగంలో హోలోగ్రామ్**

కార్డు దుర్వినియోగాన్ని అరికట్టేందుకు వెనుక భాగంలో ప్రత్యేక హోలోగ్రామ్ ఏర్పాటు చేశారు. తక్షణ సమాచారాన్ని పొందేందుకు క్యూఆర్ కోడ్‌ను కూడా అందుబాటులో ఉంచారు.

**చిరునామా వివరాలు**

లబ్ధిదారుడి గ్రామం, ప్రాంతం, మండలం, జిల్లా, పూర్తి చిరునామా వివరాలను కార్డులో పొందుపరిచారు. దీంతో కుటుంబ వివరాలను సులభంగా గుర్తించే అవకాశం ఉంటుంది.

**పారదర్శకతకు ప్రాధాన్యం**

కొత్త స్మార్ట్ కార్డుల ద్వారా రేషన్ సరుకుల పంపిణీ ప్రక్రియలో మరింత పారదర్శకత తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తోంది. డిజిటల్ సాంకేతికతను వినియోగించడం ద్వారా లబ్ధిదారులకు సేవలను వేగంగా అందించేందుకు ఈ విధానం ఉపయోగపడుతుందని అధికారులు చెబుతున్నారు.



# అంతా మా ఇష్టం!

తెలంగాణ బ్యూరో, సిరి న్యూస్

ఇటీవల జరిగిన వరుస పరిణామాలతో ఇంటర్ బోర్డులో జరుగుతున్న అవతవకలు ఒక్కోటిగా బయటపడుతున్నాయి. తెలంగాణలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు 430 ఉండగా, వీటిలో దాదాపు 3,000 వరకు వివిధ రకాల అధ్యాపకులు ఉన్నారు. వీరితో పాటు నాన్ టీచింగ్ సిబ్బంది వందల సంఖ్యలోనే ఉన్నారు. ఇంటర్ బోర్డు ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే సంస్థ అయినప్పటికీ, ఇక్కడ ప్రభుత్వ ఆదేశాల కంటే ఒక నాయకుడి ఆదేశాలకే ఎక్కువ ప్రాధాన్యత ఉన్నట్టు అవగతమవుతోంది. ఇందుకు కారణం పదోన్నతులలో వారు వ్యవహరించిన తీరే! ఇంటర్ బోర్డులో పదోన్నతి కేవలం కాసులు ఉన్నవాళ్లకేనన్న అపవాదును మూటకట్టుకుంది.




**పదోన్నతులకు ప్రాతిపదిక ఏది?**

తెలంగాణ ఇంటర్ బోర్డులో గత పదేళ్లలో జరిగిన నాన్ టీచింగ్ ప్రమోషన్ల విషయాన్ని పరిశీలిస్తే ఆ శాఖ అధికారులు నిబంధనలు పాటించారా లేదా అనే విషయం స్పష్టంగా అవగతమవుతోంది. ప్రతి ప్రభుత్వ శాఖలో డిపార్ట్‌మెంటల్ ప్రమోషన్ కమిటీ ఏర్పాటు చేసి ప్రమోషన్లు ఇవ్వడానికి ఒక్కోసారి 6 నెలల నుండి సంవత్సర కాలం పట్టే అవకాశం ఉంటుంది. ఇందుకు రకరకాల కారణాలు ఉన్నాయి. కానీ ఇంటర్ బోర్డుకు సంబంధించి కింది స్థాయి ఉద్యోగులను లైబ్రేరియన్లుగా పదోన్నతి ఇవ్వాలంటే, మొదట ఆ ఉద్యోగికి సంబంధించిన విద్యార్హతలకు సంబంధించి ఆయా కళాశాలల నుండి జెన్యూనిటీ రావాలి. అప్పుడు సదరు ఉద్యోగి దూరవిద్యలో చదివిన కళాశాలలకు సంబంధించి యూజీసీ అనుమతి ఉన్నదా లేదా అన్న నిర్ధారణ జరగాలి. దీనితో పాటు సదరు ఉద్యోగి దూరవిద్యకు సంబంధించిన అనుమతులు ఆ శాఖ నుండి పొందారా లేదా అన్న స్పష్టత ఉండాలి. వీటిలో దేనినీ పరిగణనలోకి తీసుకోకుండానే ఎవరైనా ఉద్యోగి పదవీ విరమణ పొందారంటే చాలు పదోన్నతులు ఇస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇందుకు కారణం గడిచిన ఏడాదిలో మూడు సార్లు పదోన్నతులు ఇవ్వడం వెనుక భారీగా అధికారులకు ముడుపులు ముట్టాయన్న ఆరోపణలు ఉండటమే.

**పదేళ్లలో జెన్యూనిటీ ఎంత మందికి వచ్చింది?**

తెలంగాణ ఇంటర్ బోర్డులో గత పదేళ్లలో నాన్ టీచింగ్ ఉద్యోగులు వందల సంఖ్యలో వివిధ హోదాల్లో పదోన్నతులు పొందారు. ఇందుకు సంబంధించి వారి విద్యార్హతలు, ఆయా కళాశాలల నుండి జెన్యూనిటీ సైతం విచారించకుండానే కేవలం సీటు ఖాళీ అయితే రేటు ఫిక్స్ చేసి పదోన్నతులు ఇచ్చారన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఏ ప్రభుత్వ శాఖలోనూ లేని విధంగా ఈ ఒక్క విభాగంలోనే ఇన్ని అడ్డగోలు నిర్ణయాలు ఎలా సాధ్యమవుతున్నాయని పలువురు ప్రశ్నిస్తున్నారు.

**తెరవెనుక నడుపుతున్న నేతదే కీలక పాత్ర!**

ఇంటర్ బోర్డు తీసుకునే నిర్ణయాల్లో దాదాపు ఒక యూనియన్ నేత ఆదేశాలేనన్న ఆరోపణలు వినిపిస్తున్న నేపథ్యంలో, ప్రభుత్వ సంస్థ అయిన ఆ శాఖలో ఆ నేత తెరవెనుక శాసిస్తున్నాడన్న చర్చ జోరుగా సాగుతోంది. లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే వ్యవస్థలో పాతుకుపోయిన అవినీతి మూలంగా అన్ని చోట్లా కేవలం డబ్బు మాత్రమే పనిచేస్తుందన్న ప్రచారం కొనసాగుతోంది. గత పదేళ్ల పదోన్నతులపై సమగ్ర విచారణ జరిగితే కావలసినన్ని సాక్ష్యాలు, అసలే దొరకని జెన్యూనిటీలు బయటపడే అవకాశం ఉంది.

# ఈసీఐ పేరుతో ఫేక్ మెసేజ్‌లు

మొదటిపేజీ తరువాయి

(సీఈవో) సుదర్శన్ రెడ్డి పేర్కొన్నారు. ఓటర్ వివరాలు సరిపోలడం లేదంటూ ఫేక్ మెసేజ్‌లు వస్తున్నాయని, వీటిపై జాగ్రత్తగా ఉండాలని సూచించారు. దరఖాస్తు తిరస్కరణ పేరుతో రూ.5లు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారన్నారు. వాట్సాప్ లింక్ ద్వారా దరఖాస్తు నింపాలని కోరుతున్నారని. బ్యాంక్ వివరాలు, పాస్‌వర్డ్‌లను సైబర్ నేరగాళ్లు అడుగుతున్నారని సీఈవో తెలిపారు. ఇలాంటి మెసేజ్‌లు ఈసీఐ, తెలంగాణ ఎలక్షన్ కార్యాలయం నుంచి రావని స్పష్టం చేశారు. ఫేక్ కాల్స్, మెసేజ్‌లకు స్పందించొద్దని, మోసపూరిత సందేశాలు వస్తే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సుదర్శన్ రెడ్డి సూచించారు.

# డిప్యూటీ సీఎం భట్టికి ఘన స్వాగతం

హైదరాబాద్, ఆగస్టు 13, (సిరి న్యూస్) :

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అమెరికా పర్యటనను విజయవంతంగా ముగించుకుని గురువారం రాత్రి హైదరాబాద్‌కు చేరుకున్నారు. శంషాబాద్ విమానాశ్రయంలో ఆయనకు పార్టీ రాష్ట్ర నేతలు, పార్టీ శ్రేణులు అపూర్వ స్వాగతం పలికారు. వైరా శాసనసభ్యుడు రాందాస్ నాయక్, మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు, కార్పొరేషన్ మాజీ చైర్మన్లు రాయల నాగేశ్వరరావు, చల్లా నరసింహారెడ్డి, నాయుడు సత్యం, అన్వేష్ రెడ్డి, మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, పీసీసీ ఉపాధ్యక్షుడు నెమిండ్ల శ్రీనివాస్, ఖమ్మం డీసీసీ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ, 'సుడా' చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, పీసీసీ అధికార ప్రతినిధి, ఓయూ జేఏసీ అధ్యక్షుడు లోకేష్ కుమార్ యాదవ్ తదితరులు పుష్పగుచ్ఛాలు అందించి శాలువా కప్పి సాదరంగా స్వాగతం పలికారు. ఇదిలా ఉండగా, తమ అభిమాన నాయకుడికి స్వాగతం పలికేందుకు ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో విమానాశ్రయానికి తరలివచ్చారు. విమానాశ్రయ ప్రాంగణం కార్యకర్తల నినాదాలతో కోలాహలంగా మారింది. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అందరికీ నమస్కరిస్తూ అభివాదం చేశారు.

# ఫిరాయింపు ఎమ్మెల్యేలపై.. హైకోర్టులో వాదనలు

- **స్పీకర్ తీర్పును సవాలు చేస్తూ పిటిషన్లు**
- **10 మంది ఎమ్మెల్యేలపై అనర్హత వేటు కోరుతూ విచారణ**
- **స్పీకర్ పరిధి దాటారని పిటిషనర్ల వాదన**
- **వార్తా కథనాలే ఆధారం కాదని కోర్టుకు వివరణ**
- **తదుపరి విచారణ ఈ నెల 17న**

హైదరాబాద్, ఆగస్టు 13, (సిరి న్యూస్):

బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి మారినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న 10 మంది ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలంటూ దాఖలైన పిటిషన్లపై తెలంగాణ హైకోర్టులో గురువారం సుదీర్ఘ విచారణ జరిగింది. స్పీకర్ ట్రిబ్యునల్ చైర్మన్ హోదాలో ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లను ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్, జస్టిస్ జీఎం మొహియుద్దీన్‌ల ధర్మాసనం విచారించింది. పిటిషనర్ల తరపు న్యాయవాదులు స్పీకర్ నిర్ణయాన్ని తప్పుబడుతూ పలు అంశాలను కోర్టు దృష్టికి తీసుకెళ్లారు.

**స్పీకర్ పరిధిపై అభ్యంతరం**

పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం ప్రకారం నిర్ణయం తీసుకునే సమయంలో స్పీకర్ చట్టంలో లేని అంశాలను పరిగణనలోకి తీసుకున్నారని పిటిషనర్ల తరపు సీనియర్ న్యాయవాది గండ్ర మోహన్‌రావు వాదించారు. ప్రభుత్వ స్థిరత్వం, అసెంబ్లీలో పార్టీల బలం, ప్రతిపక్షానికి ఉన్న మద్దతు వంటి అంశాలను పరిశీలించడం స్పీకర్ పరిధిలోకి రాదని పేర్కొన్నారు.

**ప్రజాతీర్పును కాపాడటమే లక్ష్యం**

రాజ్యాంగంలోని పదో షెడ్యూల్ ఉద్దేశం కేవలం అసెంబ్లీలో రాజకీయ సమీకరణాలను నిర్వహించడం కాదని న్యాయవాది తెలిపారు. ప్రజలు ఇచ్చిన తీర్పును పార్టీ ఫిరాయింపుల ద్వారా నిర్వీర్యం కాకుండా చూడటమే దాని ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. ఈ అంశాన్ని స్పీకర్ తీర్పులో పరిగణనలోకి తీసుకోలేదని వాదించారు.

**పక్కా ఆధారాలిచ్చామని వాదన**

అనర్హత పిటిషన్లలో కేవలం వార్తా కథనాలనే ఆధారంగా చూపలేదని పిటిషనర్ల తరపు న్యాయవాదులు స్పష్టం చేశారు. ఎన్నికల గెజిట్లు, అధికారిక పత్రాలు, ఫారం26 అఫిడవిట్లను సాక్ష్యాలుగా సమర్పించినట్లు తెలిపారు. వార్తా కథనాల మూలాలు, రిపోర్టర్లు, ఎడిటర్ల వివరాలు లేవన్న కారణంతో పిటిషన్లను తిరస్కరించడం సరికాదని కోర్టుకు వివరించారు.

**10 మంది ఎమ్మెల్యేల వ్యవహారం**

కాలే యాదయ్య, దానం నాగేందర్, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, కడియం శ్రీహరి, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, టి.ప్రకాశ్ గౌడ్, ఎ.గాంధీ, తెల్లం వెంకట్‌రావు, గూడెం మహిపాల్‌రెడ్డి, సంజయ్‌కుమార్‌లపై అనర్హత వేటు కోరుతూ పిటిషన్లు దాఖలయ్యాయి. వీరిపై ఫిరాయింపు ఆరోపణలు ఉన్నప్పటికీ అధికారికంగా పార్టీ మారలేదన్న స్పీకర్ నిర్ణయాన్ని పిటిషనర్లు సవాలు చేస్తున్నారు.

**17న తదుపరి విచారణ**

బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు గుంతకండ్ల జగదీశ్‌రెడ్డి, కేపీ వివేకానంద, కల్వకుంట్ల సంజయ్, పల్లె రాజేశ్వర్‌రెడ్డితో పాటు బీజేపీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్లపై విచారణ కొనసాగుతోంది. ఇరుపక్షాల ప్రాథమిక వాదనలు విన్న ధర్మాసనం తదుపరి విచారణను ఈ నెల 17కు వాయిదా వేసింది.

# ప్రతిష్ఠాత్మకంగా 'ఖేలో ఇండియా' నిర్వహణ

న్యూఢిల్లీ, ఆగస్టు 13 , (సిరి న్యూస్):

డిసెంబర్ 11 నుంచి 22వ తేదీ వరకు ఖేలో ఇండియా క్రీడలను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేసిందని కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయకు రాష్ట్ర క్రీడలు, యువజనుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి వివరించారు. న్యూఢిల్లీలో ఆయన కేంద్ర మంత్రిని గురువారం కలిశారు. ఆయనతోపాటు ప్రభుత్వ క్రీడా వ్యవహారాల సలహాదారు ఏపీ జితేందర్ రెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ కె.శివసేన రెడ్డి ఉన్నారు. తెలంగాణకు ఖేలో ఇండియా క్రీడలను కేటాయించినందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రి మాండవీయకు రాష్ట్ర ప్రభుత్వం తరపున మంత్రి వాకిటి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాసిన ఆహ్వాన లేఖను కేంద్ర మంత్రికి అందజేశారు. ఖేలో ఇండియా క్రీడల నిర్వహణలో ఎలాంటి లోపాలు, విమర్శలకు తావులేకుండా అత్యున్నత ప్రమాణాలతో నిర్వహిస్తామని స్పష్టం చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సమయం తీసుకుని, ఖేలో ఇండియా క్రీడల ప్రారంభోత్సవానికి హాజరుకావాల్సిందిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా ఆహ్వానిస్తారని తెలిపారు. తమ ప్రభుత్వం నూతన క్రీడా విధానాన్ని తీసుకొచ్చి విప్లవాత్మక నిర్ణయాలతో రాష్ట్రంలో క్రీడారంగాన్ని ముందుకు తీసుకెళ్తోందని మంత్రి వాకిటి చెప్పారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభావంతులైన క్రీడాకారులకు ప్రాధాన్యం కల్పిస్తున్నామని తెలిపారు. అందరి సహకారంతో ఖేలో ఇండియా క్రీడలను విజయవంతంగా నిర్వహించి తెలంగాణ ప్రతిష్ఠను మరింత పెంచుతామన్నారు.

# సీఎం పర్యటన ఏర్పాట్లు త్వరగా పూర్తి చేయాలి

- **అధికారులకు మంత్రి సీతక్క ఆదేశం**

ములుగు, ఆగస్టు 13, (సిరి న్యూస్) :

జిల్లాలో ఈనెల 16న ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో చేపడుతున్న ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేస్తున్న పైలాన్ నిర్మాణ పనుల పురోగతిని, నూతన కలెక్టరేట్ సముదాయాన్ని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు, ఎస్పీ సుధీర్ రావమ్‌నాథ్ కేకన్‌లతో కలిసి ఆమె గురువారం పరిశీలించారు. ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను ముందస్తుగా పూర్తి చేయాలని, ఎలాంటి లోటుపాట్లకు తావు లేకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని మంత్రి సీతక్క ఆదేశించారు. పైలాన్ నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. పనుల నిర్వహణలో ఎలాంటి జాప్యానికి తావులేకుండా సంబంధిత శాఖల అధికారులు, కాంట్రాక్టర్లు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. అనంతరం నూతన కలెక్టరేట్ భవన సముదాయాన్ని పరిశీలించిన మంత్రి భవనంలోని వివిధ విభాగాలు, కార్యాలయ గదులు, సమావేశ మందిరాలు, పరిసరాల్లో చేపడుతున్న పనులను పరిశీలించారు. కలెక్టరేట్ ప్రాంగణంలో పారిశుధ్యం, విద్యుత్, తాగునీరు, రహదారులు, పార్కింగ్‌తో పాటు అవసరమైన మౌలిక సదుపాయాలను సమకూర్చాలన్నారు. అనంతరం విలేకరులతో మంత్రి సీతక్క మాట్లాడుతూ ఈ నెల 16న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ములుగు నియోజకవర్గంలో పర్యటించనున్నారని తెలిపారు. మధ్యాహ్నం సమయంలో మేడారం చేరుకుని శ్రీ సమ్మక్కసారలమ్మ వనదేవతలను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తారన్నారు. వనదేవతల సన్నిధి నుంచి రాష్ట్రవ్యాప్తంగా అర్హులైన వితంతు మహిళలు, ఒంటరి మహిళలకు పింఛన్లు అందించే కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని తెలిపారు. ఈనెల 31 వరకు దరఖాస్తు చేసుకున్న



వారిని గతంలో అమలులో ఉన్న నిబంధనల ప్రకారం పరిశీలించి అర్హులను ఎంపిక చేయనున్నట్లు చెప్పారు. మేడారం కార్యక్రమాల అనంతరం ముఖ్యమంత్రి జిల్లా కేంద్రానికి చేరుకుని రాష్ట్రవ్యాప్తంగా పంచాయతీరాజ్ శాఖ ద్వారా మూడు విడతల్లో సుమారు రూ.16 వేల కోట్లతో చేపట్టనున్న హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (హ్యామ్) రోడ్ల పనులకు సంబంధించిన అభివృద్ధి పనుల పైలాన్‌ను గట్టమ్మ సమీపంలో ఆవిష్కరిస్తారన్నారు. తర్వాత ముఖ్యమంత్రి నూతన కలెక్టరేట్‌కు చేరుకుని తొలుత తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించి నూతన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయాన్ని ప్రారంభిస్తారని, కలెక్టరేట్ ఆవరణలో ఏర్పాటు చేసిన సభలో ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారని చెప్పారు. ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేసేందుకు నియోజకవర్గ, జిల్లా ప్రజలు, ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజాప్రతినిధులు, నాయకులు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొనాలని మంత్రి ఆహ్వానించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు సీహెచ్.మహేందర్, సంపత్ రావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవీందర్ చందర్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.




# కారు బీభత్సం.. మహిళకు తీవ్ర గాయాలు

- **నిర్మాత కారు ఢీకొని మహిళకు గాయాలు**
- **డ్రైవర్‌పై అబిడ్స్ పోలీసుల కేసు**
- **వైద్య ఖర్చులపై నిర్మాతను సంప్రదించిన కుటుంబం**
- **నిర్లక్ష్యంగా స్పందించారని బాధితుల ఆరోపణ**
- **ప్రమాదంపై కొనసాగుతున్న దర్యాప్తు**

హైదరాబాద్, ఆగస్టు 13, (సిరి న్యూస్):

హైదరాబాద్‌లోని అబిడ్స్ పరిధిలో సినీ నిర్మాత బొమ్మకు మురళికి చెందిన కారు ప్రమాదానికి గురై ఓ మహిళ తీవ్రంగా గాయపడ్డారు. చాపెల్ రోడ్డులో నడుచుకుంటూ వెళ్తున్న నాంపల్లి ఆండాళమ్మ బస్తీకి చెందిన సునీతను కారు ఢీకొనడంతో ఆమె కాలికి ఫ్రాక్చర్ కావడంతో పాటు తీవ్ర గాయాలయ్యాయి. ఘటనపై బాధితురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో అబిడ్స్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

**విధులు ముగించుకుని వెళ్తుండగా..**

గన్‌ఫౌండ్రీలోని ఎస్‌బీఐ బ్యాంకులో హౌస్‌కీపింగ్ ఉద్యోగిగా పనిచేస్తున్న సునీత ఆగస్టు 12న సాయంత్రం విధులు ముగించుకుని చాపెల్ రోడ్డు మీదుగా ఇంటికి వెళ్తున్నారు. ఆ సమయంలో నిర్మాత వద్ద డ్రైవర్‌గా పనిచేస్తున్న మహానంద కారును వేగంగా నడుపుతూ ఆమెను ఢీకొట్టినట్లు పోలీసులు తెలిపారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆమెను స్థానికులు ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.

**వైద్య ఖర్చులపై కుటుంబం విజ్ఞప్తి**

సునీత చికిత్సకు అయ్యే ఖర్చుల కోసం ఆమె కుటుంబ సభ్యులు కారు యజమాని మురళిని ఫోన్‌లో సంప్రదించినట్లు తెలిపారు. అయితే, తమ విజ్ఞప్తికి ఆయన నిర్లక్ష్యంగా, దురుసుగా స్పందించారని బాధితురాలి కుటుంబ సభ్యులు ఆరోపించారు. ఈ వ్యవహారంపై వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

**పోలీసుల దర్యాప్తు**

బాధితురాలి కుటుంబం ఫిర్యాదు ఆధారంగా అబిడ్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రమాదానికి కారణాలు, కారు నడిపిన వ్యక్తి వ్యవహారం, ఘటనకు సంబంధించిన ఇతర అంశాలపై దర్యాప్తు చేస్తున్నారు.

**సినీ నిర్మాతగా గుర్తింపు**

బొమ్మకు మురళి టెక్నోక్రాట్‌గా, సామాజిక, రాజకీయ కార్యకర్తగా పనిచేసిన అనంతరం సినీ నిర్మాతగా మారారు. ఆయన నిర్మించిన 'శరణం గచ్ఛామి' చిత్రం తెలుగు, తమిళ, హిందీ భాషల్లో విడుదలైంది. భారత రాజ్యాంగం, రిజర్వేషన్ల వ్యవస్థ వంటి అంశాలను ఇతివృత్తంగా తీసుకుని ఈ చిత్రాన్ని రూపొందించారు.

# ఇంటింటా ఇందిరమ్మ కుట్టు మిషన్లు

హైదరాబాద్, ఆగస్టు 13 , (సిరి న్యూస్):

బీసీ మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసి కుట్టు వృత్తి ద్వారా స్వయం ఉపాధి పొందేలా ప్రోత్సహించేందుకు ప్రభుత్వం చేపట్టిన ఇంటింటా ఇందిరమ్మ కుట్టు మిషన్లు పథకాన్ని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సచివాలయంలో గురువారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ బీసీ మహిళల స్వయం ఉపాధి, ఆర్థిక సాధికారతకు ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నదని తెలిపారు. బీసీ మహిళలకు 100 శాతం సబ్సిడీపై ఆటోమేటిక్ కుట్టు మిషన్లు అందించి వారిని కేవలం ప్రభుత్వ పథకాల లబ్దిదారులుగా కాక స్వయం ఉపాధి పొందే మహిళా పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని 119 శాసనసభ నియోజకవర్గాల్లో ఒక్కో నియోజకవర్గానికి వెయ్యి చొప్పున మొత్తం 1.19,లక్షల ఆటోమేటిక్ కుట్టు మిషన్లను పంపిణీ చేయనున్నట్లు మంత్రి తెలిపారు. ఒక్కో మిషన్ విలువ రూ.12,000 కాగా 100 శాతం సబ్సిడీపై అందజేస్తామని చెప్పారు. ఈనెల 15 నుంచి సెప్టెంబర్ 15 వరకు అర్హులైన బీసీ మహిళల నుంచి దరఖాస్తులను స్వీకరించనున్నట్లు వెల్లడించారు.

**పేద, ఒంటరి మహిళలకు ప్రాధాన్యత**

కుట్టు వృత్తిపై ఆసక్తి ఉన్న నిరుద్యోగ బీసీ మహిళలకు ఈ పథకం ద్వారా స్వయం ఉపాధి కల్పించడమే ప్రధాన ఉద్దేశమని మంత్రి పొన్నం తెలిపారు. అత్యంత పేదలు, వితంతువులు, ఒంటరి మహిళలు, నిరాశ్రయులు, అనాథలు, వికలాంగులు, అలాగే కుట్టు వృత్తిలో అనుభవం ఉన్న మహిళలకు నిబంధనల మేరకు ప్రాధాన్యత కల్పిస్తామని చెప్పారు. లబ్దిదారుల ఎంపిక ప్రక్రియ పారదర్శకంగా, ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం జరుగుతుందని మంత్రి స్పష్టం చేశారు. కుట్టు మిషన్ల వినియోగంపై అవసరమైన శిక్షణను కూడా తప్పనిసరి చేస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో పథకాన్ని మరింత విస్తరించి ఎక్కువమందికి ప్రయోజనం కల్పించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. కాగా, బీసీ సంక్షేమ శాఖ ద్వారా ఆత్మగౌరవ భవనాలకు నిధులు కేటాయిస్తూ వాటి నిర్మాణాలను పూర్తి చేస్తామని మంత్రి తెలిపారు. ఇటీవల బలహీనవర్గాల ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించి బీసీల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించామని చెప్పారు. కులగణన అనంతరం బీసీల అభివృద్ధికి సంబంధించిన తదుపరి కార్యాచరణను ముందుకు తీసుకెళ్తామని మంత్రి పేర్కొన్నారు.

**పూలే దంపతుల విగ్రహాల ఆవిష్కరణకు భారీగా తరలిరావాలి**

ఈనెల 14న సాయంత్రం 4 గంటలకు హెచ్ఎండీఏ గ్రౌండ్స్ ఎదురుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా మహాత్మా జ్యోతి బాపూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాలను ఆవిష్కరించనున్నట్లు మంత్రి పొన్నం తెలిపారు. అలాగే ఈనెల 18న సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి సందర్భంగా ట్యాంక్‌బండ్‌పై ఆయన విగ్రహాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నారని మంత్రి తెలిపారు. ఈ రెండు కార్యక్రమాల్లో బీసీ ప్రజాప్రతినిధులు, బీసీ సంఘాల నాయకులు, వివిధ కుల సంఘాల నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని మంత్రి పొన్నం పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు వి.హనుమంత రావు, ప్రభుత్వ విప్‌లు ఆది శ్రీనివాస్, బీర్ల ఐలయ్య, ఎమ్మెల్యేలు ఈర్లపల్లి శంకరయ్య, నవీన్ యాదవ్, కాలేరు వెంకటేష్, వివిధ కులాల కార్పొరేషన్ చైర్మన్లు, బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి బాలమయాదేవి, బీసీ సంక్షేమ శాఖ అధికారులు మల్లయ్య బట్టు, అలోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# పిల్లల ఆరోగ్యంతో ఆటలొద్దు

**న్యూఢిల్లీ, ఆగస్టు 13, (సిరి న్యూస్) :**

అధిక మోతాదులో ఉప్పు, చక్కెర, సంతృప్త కొవ్వులు ఉండే ఆహార పదార్థాల ప్యాకెట్‌లపై లేబుల్స్ విషయంలో కేంద్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు గురువారం గట్టి హెచ్చరిక చేసింది. 'మీరు చేయలేకపోతే మేమే చేస్తాం' అంటూ తేల్చి చెప్పింది. ప్రజల ఆరోగ్యానికి, ముఖ్యంగా పిల్లల ఆరోగ్యానికి సంబంధించిన అంశాల్లో కార్పొరేట్ ఒత్తిళ్లకు తలొగ్గకూడదని స్పష్టం చేసింది. జస్టిస్ జేబీ పర్దీవాలా, జస్టిస్ కే వినోద్ చంద్రన్‌తో కూడిన ధర్మాసనం ఈ అంశంపై దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని విచారించింది. ఆహార పదార్థాలపై హెచ్చరిక లేబుల్స్ విషయంలో కేంద్ర ప్రభుత్వం, భారత ఆహార భద్రత, ప్రమాణాల సంస్థ వ్యవహరిస్తున్న తీరుపై ధర్మాసనం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. అధిక చక్కెర, ఉప్పు, సంతృప్త కొవ్వుల గురించి అవగాహన కలిగించేందుకు ప్యాకెట్‌ల ముందు భాగంలో స్పష్టమైన హెచ్చరికలు ఉండాలని పిటిషనర్ తరఫు న్యాయవాది వాదించారు. ఈ విషయంలో ఆహార పరిశ్రమ అభ్యంతరాలను మాత్రమే ఎఫ్ఎస్ఎస్ఏఐ పరిగణనలోకి తీసుకుందన్నారు. హార ప్యాకెట్లపై హెచ్చరిక గుర్తులకు బదులుగా అదనపు చక్కెర, సంతృప్త కొవ్వులు, ఉప్పు మొదలైన వాటిని రోజుకు ఎంతో తీసుకోవచ్చో పట్టిక రూపంలో చూపించే విధానాన్ని ఎఫ్ఎస్ఎస్ఏఐ సూచించింది. అయితే ఈ విధానం వినియోగదారులకు అవసరమైనంత అవగాహన అందించదనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో కేంద్రం తీసుకున్న చర్యలపై సుప్రీంకోర్టు ప్రశ్నలు సంధించింది. గతంలో కోర్టు ఇచ్చిన ఆదేశాలను ఎందుకు అమలు చేయలేదని, ఇప్పటివరకు ప్రభుత్వం ఏ చర్యలు తీసుకుందని ధర్మాసనం ప్రశ్నించింది. హెచ్చరిక లేబుల్స్ వల్ల ఉత్పత్తుల విక్రయాలపై ప్రభావం పడుతుందని తయారీదారులు అభ్యంతరం వ్యక్తం చేయవచ్చని కోర్టు పేర్కొంది. అయితే తాము తినే ఆహారంలో ఎంత చక్కెర, ఉప్పు, సంతృప్త కొవ్వు ఉందో తెలుసుకునే హక్కు వినియోగదారులకు ఉందని స్పష్టం చేసింది. హెచ్చరిక ఉన్నప్పటికీ ఉత్పత్తిని కొనాలా, వద్దా అనే తుది నిర్ణయం వినియోగదారుడిదేనని తెలిపింది. హెచ్చరిక లేబుల్స్‌కు సంబంధించిన ప్రతిపాదనపై చర్యలు తీసుకునేందుకు కేంద్రానికి సుప్రీంకోర్టు రెండు వారాల గడువు ఇచ్చింది. తదుపరి విచారణ సమయంలో అవసరమైతే తుది ఆదేశాలు జారీ చేస్తామని ధర్మాసనం స్పష్టం చేసింది.

# దిల్లీ పేలుళ్ల వెనుక అల్‌ఖైదా అనుబంధ సంస్థ

- ఐక్యరాజ్యసమితి నివేదిక వెల్లడి

**న్యూదిల్లీ, ఆగస్టు 13, (సిరి న్యూస్) :**

దిల్లీలో 2025 నవంబరులో జరిగిన పేలుళ్ల వెనుక అల్‌ఖైదా అనుబంధ ఉగ్రవాద సంస్థ అల్‌ఖైదా ఇన్ ఇండియన్ సబ్‌కాంటినెంట్ కుట్ర ఉందని ఐక్యరాజ్యసమితి నివేదిక వెల్లడించినట్లు సమాచారం. దిల్లీలోని ఎర్రకోట సవి□పంలో జరిగిన కారు బాంబు పేలుడు ఘటనపై దర్యాప్తులో ఈ అంశాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఆల్‌ఖైదా ప్రాంతీయ కార్యకలాపాలను విస్తరిస్తున్న ఉగ్రవాద సంస్థగా నివేదికలో పేర్కొన్నట్లు తెలుస్తోంది. తాలిబన్ల నుంచి మద్దతు, ఆశ్రయం లభిస్తున్నట్లు ఐక్యరాజ్య సమితి ప్రస్తావించినట్లు సమాచారం. దీంతో పలు ప్రాంతాల్లో అల్‌ఖైదా నెట్‌వర్క్ మరోసారి బలపడుతున్నదనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా భారత్ సహా ఆయా దేశాల్లో ఉగ్రవాద కార్యకలాపాలకు అల్‌ఖైదా ముప్పుగా మారే అవకాశం ఉందని భద్రతా వర్గాలు భావిస్తున్నాయి. ఈ ఘటనకు సంబంధించిన కుట్ర, ఉగ్రవాద నెట్‌వర్క్‌పై దర్యాప్తు కొనసాగుతున్న నేపథ్యంలో ఐక్యరాజ్య సమితి నివేదికలోని అంశాలు కీలకంగా మారాయి. ఉగ్రవాద సంస్థల కదలికలను నిశితంగా పర్యవేక్షించాల్సిన అవసరాన్ని ఈ పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి. దిల్లీ పేలుళ్ల కేసులో మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చే కొద్దీ ఈ అంతర్జాతీయ ఉగ్రవాద నెట్‌వర్క్‌పై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది.



# రాంచీలో విద్యార్థుల ఆందోళన ఉధృతం

- పరీక్షల అక్రమాలపై 20 రోజులుగా నిరసనలు
- అసెంబ్లీ ముట్టడికి యత్నించిన వారిపై పోలీసుల లాఠీఛార్జ్
- 600 మందిపై ఎఫ్ఐఆర్.. బీజేపీ బంద్‌తో వేడెక్కిన రాజకీయం
- సీబీఐ విచారణకు డిమాండ్.. ప్రభుత్వంపై ప్రతిపక్షాల ఒత్తిడి
- విద్యార్థులతో ఆరు విడతల చర్చలు విఫలం

**రాంచీ, ఆగస్టు 13, (సిరి న్యూస్):**

జార్ఖండ్‌లో నియామక పరీక్షల నిర్వహణపై విద్యార్థుల ఆందోళన తీవ్ర రూపం దాల్చింది. పరీక్షల్లో అక్రమాలు, అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ 'JPSCJSSC రిఫార్మ్స్ మంచ్' ఆధ్వర్యంలో రాంచీలోని జైపాల్ సింగ్ ముండా స్టేడియంలో చేపట్టిన నిరసన గురువారానికి 20వ రోజుకు చేరింది. పరీక్షల్లో పారదర్శకత పాటించాలని, గతంలో నిర్వహించిన కొన్ని పరీక్షలను రద్దు చేయాలని, మొత్తం వ్యవహారంపై స్వతంత్ర దర్యాప్తు జరిపించాలని ఆందోళనకారులు డిమాండ్ చేస్తున్నారు. తమ డిమాండ్లు పరిష్కారమయ్యే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

**అసెంబ్లీ ముట్టడికి యత్నం**

గురువారం అసెంబ్లీ వైపు మార్చ్ చేపట్టిన విద్యార్థులను పోలీసులు అడ్డుకున్నారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో లాఠీఛార్జ్ చేయడంతో పాటు వాటర్ కెనన్లు, భాష్పవాయు గోళాలను ప్రయోగించి ఆందోళనకారులను చెదరగొట్టారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించారన్న ఆరోపణలతో సుమారు 600 మందిపై కేసులు నమోదు చేశారు. వీరిలో 100 మందిని పేర్లతో, మరో 500 మందిని గుర్తుతెలియని నిరసనకారులుగా ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నట్లు సమాచారం.

**బీజేపీ రాష్ట్రవ్యాప్త బంద్**

విద్యార్థులపై పోలీసుల చర్యను నిరసిస్తూ బీజేపీ రాష్ట్రవ్యాప్తంగా బంద్‌కు పిలుపునిచ్చింది. ప్రభుత్వం ఉద్యమాన్ని అణచివేసేందుకు ప్రయత్నిస్తోందని పార్టీ నేతలు ఆరోపించారు. నియామక పరీక్షల వ్యవహారంపై వారం రోజుల్లోగా సీబీఐ దర్యాప్తునకు ఆదేశించకపోతే ఆమరణ నిరాహార దీక్ష చేపడతామని మాజీ ముఖ్యమంత్రి రఘుబర్ దాస్ హెచ్చరించారు. 2024 ఎక్సైజ్ కానిస్టేబుల్ శారీరక పరీక్షల సందర్భంగా మృతి చెందిన 19 మంది అభ్యర్థుల కుటుంబాలకు రూ.కోటి చొప్పున పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

**ఎస్ఐటీపై ఏబీవీపీ అనుమానాలు**

ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందంలో సభ్యులను పలుమార్లు మార్చడంపై ఏబీవీపీ అభ్యంతరం వ్యక్తం చేసింది. దర్యాప్తు విశ్వసనీయతపై అనుమానాలు ఉన్నాయని పేర్కొంటూ దేశవ్యాప్తంగా 1,200కు పైగా విశ్వవిద్యాలయాల్లో ఆందోళనలు చేపడతామని ప్రకటించింది.

**బీజేపీపై అధికార పక్షం ఎదురుదాడి**

విద్యార్థుల ఆందోళనను బీజేపీ రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగించుకుంటోందని అధికార పక్షం ఆరోపించింది. ఉద్యమాన్ని హింసాత్మకంగా మార్చేందుకు ఇతర రాష్ట్రాల నుంచి వ్యక్తులను తీసుకొచ్చి ఉద్రిక్తత సృష్టిస్తున్నారని ప్రత్యారోపణలు చేసింది. దీంతో నియామక పరీక్షల వివాదం రాజకీయ రంగు పులుముకుంది.

**ఆరు విడతల చర్చలు విఫలం**

సంక్షోభాన్ని పరిష్కరించేందుకు ప్రభుత్వం, విద్యార్థి ప్రతినిధుల మధ్య ఆరు దఫాలుగా చర్చలు జరిగినా ఏకాభిప్రాయం కుదరలేదు. పరీక్షల సంస్కరణలకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ తెలిపారు. విద్యార్థుల అభ్యర్థన మేరకు 14వ జేపీఎస్సీ పరీక్షను రద్దు చేస్తామని హామీ ఇచ్చారు. అయితే బీజేపీ రాజకీయ లబ్ధి కోసం ఉద్యమాన్ని ఉపయోగించుకుంటోందని ఆయన విమర్శించారు.

# గందరగోళంలో వర్షా కాల సమావేశాలు..

- బీజేపీ, విపక్షాల పోటాపోటీ నిరసనలు
- చివరి రోజూ కొనసాగిన రాజకీయ ఘర్షణ
- మకర్ ద్వార్ వద్ద ఇరు పక్షాల ఆందోళనలు
- సభ సజావుగా సాగకపోవడంపై పరస్పర ఆరోపణలు
- చర్చలు లేకుండానే నిరవధిక వాయిదా



**న్యూఢిల్లీ, ఆగస్టు 13, (సిరి న్యూస్):**

జులై 20న ప్రారంభమైన పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు తీవ్ర గందరగోళం, రాజకీయ ఘర్షణల మధ్య ముగిశాయి. గురువారం ఉభయ సభలు ప్రారంభమైన కొద్దిసేపటికే నిరవధికంగా వాయిదా పడ్డాయి. చివరి రోజున కూడా అధికార, విపక్ష సభ్యులు పార్లమెంట్ ప్రాంగణంలోని మకర్ ద్వార్ వద్ద పోటాపోటీగా నిరసనలు చేపట్టడంతో సమావేశాలకు సజావుగా ముగింపు లభించలేదు.

**జాతీయ గీతం తర్వాత వాయిదా**

లోక్‌సభ ప్రారంభమైన వెంటనే జాతీయ గీతం వందేమాతరం ఆరు చరణాలను ఆలపించారు. అనంతరం స్పీకర్ ఓం బిర్లా సభను నిరవధికంగా వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. సాధారణంగా సమావేశాల చివరి రోజున సభ పనితీరు, ఉత్పాదకతపై స్పీకర్ ముగింపు ప్రసంగం చేస్తారు. అయితే ఈసారి అలాంటి ప్రసంగం లేకుండానే సభ ముగిసింది. ప్రధాని నరేంద్ర మోదీ, హోంమంత్రి అమిత్ షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కొద్దిసేపు సభలో ఉన్నారు.

**రాహుల్‌పై బీజేపీ నిరసన**

ఝార్ఖండ్‌లో కొనసాగుతున్న ఆందోళనలపై రాహుల్ గాంధీ స్పందించడం లేదని ఆరోపిస్తూ బీజేపీ ఎంపీలు మకర్ ద్వార్ వద్ద నిరసన చేపట్టారు. ప్రజా సమస్యలపై విపక్షం బాధ్యతగా వ్యవహరించకుండా సభా కార్యకలాపాలను అడ్డుకుంటోందని విమర్శించారు. దీనికి ప్రతిగా కాంగ్రెస్ సహా విపక్ష ఎంపీలు కూడా అక్కడే ఆందోళన చేపట్టారు. కాంగ్రెస్ ఎంపీ పవన్ ఖేడా నేతృత్వంలోని నిరసనలో కోతి బొమ్మను ప్రదర్శిస్తూ చేసిన నినాదాలు వివాదానికి దారితీశాయి.

**సభ నడపడం ప్రభుత్వ బాధ్యత**

పార్లమెంట్ కార్యకలాపాలు సజావుగా సాగకపోవడానికి విపక్షాలను బాధ్యులను చేయడం సరికాదని ప్రతిపక్ష ఎంపీలు అన్నారు. సభను నిర్వహించే బాధ్యత ప్రభుత్వానిదేనని తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ సౌగత రాయ్ పేర్కొన్నారు. ఝార్ఖండ్ అంశంపై ప్రభుత్వం నుంచి స్పష్టమైన సమాధానం కోరినా స్పందన రాలేదని ఆరోపించారు. కాంగ్రెస్ ఎంపీ గుర్జీత్ సింగ్ ఔజ్లా కూడా చర్చలకు ప్రభుత్వం ముందుకు రాలేదని విమర్శించారు.

**విపక్షమే అడ్డుకుంటోందన్న బీజేపీ**

మరోవైపు సభా కార్యకలాపాలకు విపక్షమే ఆటంకం కలిగిస్తోందని బీజేపీ ఆరోపించింది. రాహుల్ గాంధీ సభను అడ్డుకునే వైఖరి అవలంబిస్తున్నారని కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్ విమర్శించారు. పార్లమెంటరీ వ్యవస్థ నిబంధనల ప్రకారమే నడుస్తుందని, దాన్ని వ్యక్తిగత రాజకీయ ప్రయోజనాలకు అనుగుణంగా మార్చలేరని అన్నారు.

**వరుస అంతరాయాలతో సమావేశాలు**

వర్షాకాల సమావేశాల ప్రారంభం నుంచే నీట్ పేపర్ లీకేజీ, విద్యార్థులపై లాఠీచార్జ్, అయోధ్య విరాళాల వ్యవహారం సహా పలు అంశాలపై విపక్షాలు నిరసనలు చేపట్టాయి. మరోవైపు ఝార్ఖండ్ ఆందోళనలపై రాహుల్ గాంధీ స్పందించాలంటూ బీజేపీ సభ్యులు ఆందోళనకు దిగారు. సభ లోపల, వెలుపల ఇరు పక్షాల నిరసనలతో తరచూ కార్యకలాపాలకు అంతరాయం ఏర్పడింది. చివరి రోజూ అదే పరిస్థితి కొనసాగడంతో ఎలాంటి కీలక చర్చలు లేకుండానే సమావేశాలకు తెరపడింది.

# మాజీ మావోయిస్టుల క్యాట్‌వాక్..

- ర్యాంప్‌పై సందడి చేసిన మాజీ మహిళా మావోయిస్టులు
- చేనేత దుస్తుల్లో ఆత్మవిశ్వాసంతో అడుగులు

**రాయ్‌పూర్, ఆగస్టు 14, (సిరి న్యూస్):**

ఒకప్పుడు దట్టమైన అడవుల్లో ఆయుధాలతో తిరిగిన మాజీ మహిళా మావోయిస్టులు ఇప్పుడు చేనేత వస్త్రాలతో ర్యాంప్‌పై సందడి చేశారు. ఆయుధాలను వీడి జనజీవన స్రవంతిలోకి వచ్చిన వారు రాయ్‌పూర్‌లో నిర్వహించిన ఫ్యాషన్ షోలో మోడళ్లుగా పాల్గొని క్యాట్‌వాక్ చేశారు. వారి ఆత్మవిశ్వాసంతో కూడిన ప్రదర్శన కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

**చేనేత దుస్తుల్లో..**

జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ఈ ఫ్యాషన్ షోలో మాజీ మహిళా మావోయిస్టులు సంప్రదాయ చేనేత వస్త్రాలు ధరించి ర్యాంప్‌పై నడిచారు. చిరునవ్వులతో, ధైర్యంగా అడుగులు వేస్తూ ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. సభికులు చప్పట్లతో వారిని అభినందించారు.

**సీఎం విష్ణుదేవ్ సాయ్ హాజరు**

ఈ కార్యక్రమానికి ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయ్ హాజరయ్యారు. చేనేత వారసత్వాన్ని కాపాడుతూ ముందుకు తీసుకెళ్తున్న వారిని ఆయన అభినందించారు. హింసకు దూరమై సాధారణ జీవితం గడుపుతున్న మాజీ మావోయిస్టుల ప్రదర్శన వేడుకలో ప్రత్యేకంగా నిలిచింది.

**సోషల్ మీడియాలో వైరల్**

మాజీ మహిళా మావోయిస్టులు ర్యాంప్‌పై క్యాట్‌వాక్ చేసిన దృశ్యాలకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. వారి జీవితాల్లో వచ్చిన మార్పును నెటిజన్లు ప్రశంసిస్తున్నారు. హింసను వీడి సమాజంలో గౌరవప్రదమైన జీవితాన్ని ప్రారంభించిన వారికి ఇలాంటి అవకాశాలు కల్పించడం స్ఫూర్తిదాయకమని పలువురు అభిప్రాయపడుతున్నారు.

**కొత్త జీవితానికి ప్రతీకగా..**

గతంలో అడవుల్లో తుపాకులు పట్టిన మహిళలు ఇప్పుడు చేనేత వస్త్రాల్లో ర్యాంప్‌పై ఆత్మవిశ్వాసంతో నడవడం వారి పునరావాస ప్రయాణానికి ప్రతీకగా నిలిచింది. సాధారణ జీవనంలోకి తిరిగి వచ్చిన వారికి సామాజికంగా అవకాశాలు కల్పిస్తే వారు తమ ప్రతిభను చాటుకోగలరని ఈ కార్యక్రమం చాటిచెప్పింది.




# నల్సార్ విద్యార్థులపై బీసీఐ వెనక్కి

- సీజేఐ ఆహ్వానంపై విద్యార్థుల అభ్యంతరం
- ఎన్‌రోల్‌మెంట్‌పై ఆంక్షలు ఎత్తివేత
- విద్యార్థులపై చర్యలు ఉండవని స్పష్టత
- వైస్‌ఛాన్సలర్ నుంచి నివేదిక కోరిన బీసీఐ
- తొలి నిర్ణయాన్ని ప్రశ్నించిన కేకే వేణుగోపాల్
- సీజేఐ ఆహ్వానాన్ని వ్యతిరేకించిన 450 మంది విద్యార్థులు

**హైదరాబాద్, ఆగస్టు 13, (సిరి న్యూస్):**

నల్సార్‌లో 2026లో న్యాయ విద్య పూర్తి చేసిన విద్యార్థుల అడ్వొకేట్ ఎన్‌రోల్‌మెంట్‌పై విధించిన ఆంక్షలను బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (బీసీఐ) వెనక్కి తీసుకుంది. యూనివర్సిటీ కాన్వొకేషన్‌కు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్‌ను ముఖ్య అతిథిగా ఆహ్వానించడాన్ని కొందరు విద్యార్థులు వ్యతిరేకించిన నేపథ్యంలో బీసీఐ తొలుత కఠిన ఆదేశాలు జారీ చేసింది. అయితే, కొన్ని గంటల్లోనే ఆ నిర్ణయాన్ని సవరించి విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్‌పై ఆంక్షలను తొలగించింది.

**తొలి ఆదేశాలతో కలకలం**

2026లో నల్సార్ నుంచి న్యాయ విద్య పూర్తి చేసిన ఏ విద్యార్థినీ తదుపరి ఆదేశాలు వచ్చే వరకు ఏ రాష్ట్ర బార్ కౌన్సిల్‌లోనూ అడ్వొకేట్‌గా ఎన్‌రోల్ చేయరాదని బీసీఐ తొలుత ఆదేశించింది. దీంతో విద్యార్థుల భవిష్యత్తుపై ఆందోళన వ్యక్తమైంది. అయితే అనంతరం జారీ చేసిన సవరించిన ఉత్తర్వుల్లో విద్యార్థులపై ఎలాంటి చర్యలు తీసుకోబోమని బీసీఐ స్పష్టం చేసింది.

**వైస్‌ఛాన్సలర్ నుంచి నివేదిక**

కాన్వొకేషన్ వివాదానికి సంబంధించిన పూర్తి వివరాలతో నివేదిక ఇవ్వాలని నల్సార్ వైస్‌ఛాన్సలర్‌ను బీసీఐ కోరింది. కొందరు అధ్యాపకులు, బయటి వ్యక్తులు విద్యార్థులను ప్రేరేపించారని బీసీఐ ఆరోపించింది. విద్యార్థులు అమాయకులని పేర్కొంటూ, విచారణలో ఎలాంటి క్రమశిక్షణ ఉల్లంఘన లేదని తేలితే ఎన్‌రోల్‌మెంట్ ప్రక్రియ కొనసాగుతుందని స్పష్టం చేసింది.

**తొలి నిర్ణయంపై అభ్యంతరాలు**

మాజీ అటార్నీ జనరల్, సీనియర్ న్యాయవాది కేకే వేణుగోపాల్ బీసీఐ తొలి నిర్ణయాన్ని ప్రశ్నించారు. విద్యార్థులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేయకుండా నిరోధించే అధికారం బీసీఐకి లేదని పేర్కొన్నారు. దీంతో ఈ వ్యవహారం విద్యార్థుల భావప్రకటనా స్వేచ్ఛకు సంబంధించిన అంశంగానూ చర్చకు వచ్చింది.

**సీజేఐ ఆహ్వానంపై నిరసన**

నల్సార్ 2026 బ్యాచ్‌కు చెందిన 450 మందికి పైగా విద్యార్థులు యూనివర్సిటీ అధికారులకు వినతిపత్రం సమర్పించారు. కాన్వొకేషన్‌కు జస్టిస్ సూర్యకాంత్‌ను ముఖ్య అతిథిగా ఆహ్వానించే నిర్ణయాన్ని పునఃపరిశీలించాలని కోరారు. యువతను బొద్దింకలతో పోల్చడం, జంతర్ మంతర్ నిరసనల సమయంలో పోలీసులు వ్యవహరించిన తీరుపై చేసిన వ్యాఖ్యలను వారు ప్రస్తావించారు.

**విద్యార్థులపై చర్యలు లేవు**

తొలి ఉత్తర్వులతో ఏర్పడిన పరిస్థితిని బీసీఐ గంటల వ్యవధిలోనే సవరించడం ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రస్తుతం విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్‌కు ఎలాంటి ఆంక్షలు లేవని స్పష్టం చేసింది. అయితే కాన్వొకేషన్ వివాదంపై యూనివర్సిటీ నుంచి నివేదిక అందిన తర్వాత తదుపరి చర్యలపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

# ఆప్‌లో నా మాటకు విలువ లేకే బీజేపీలో చేరా

**ఇంటర్నెట్ డెస్క్, ఆగస్టు 14:**

ఆమ్ ఆద్మీ పార్టీలో తన సూచనలకు ప్రాధాన్యం దక్కకపోవడంతోనే పార్టీని వీడి బీజేపీలో చేరానని మాజీ క్రికెటర్, రాజ్యసభ సభ్యుడు హర్భజన్ సింగ్ తెలిపారు. క్రీడల అభివృద్ధికి కృషి చేయాలనే ఉద్దేశంతోనే ఆప్‌లో చేరానని, అయితే తన ఆలోచనలను పార్టీ నాయకత్వం పట్టించుకోకపోవడంతో బయటకు రావాల్సి వచ్చిందని ఓ పాడ్‌కాస్ట్‌లో వెల్లడించారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో హర్భజన్‌తోపాటు మరో ఆరుగురు ఆప్ రాజ్యసభ సభ్యులు బీజేపీలో చేరారు.

**క్రీడల కోసమే రాజకీయాల్లోకి**

రాజ్యసభలో ఆప్ తరఫున ప్రాతినిధ్యం వహించాలని పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్ తనను ఆహ్వానించారని హర్భజన్ తెలిపారు. రాజకీయ అంశాల జోలికి వెళ్లకుండా క్రీడలకు సంబంధించిన విషయాలపైనే పనిచేస్తానని అప్పుడే స్పష్టం చేసినట్లు చెప్పారు. పంజాబ్‌తో పాటు దేశవ్యాప్తంగా క్రీడలను ప్రోత్సహించే అవకాశం లభిస్తుందనే ఉద్దేశంతోనే ఆప్‌లో చేరానన్నారు.

**సూచనలను పట్టించుకోలేదు**

క్రీడలకు సంబంధించి తాను చేసిన సూచనలను పార్టీ నాయకత్వం పట్టించుకోలేదని హర్భజన్ ఆరోపించారు. కనీసం ఒక్క సూచననైనా అమలు చేసి ఉంటే పార్టీని వీడాల్సిన అవసరం ఉండేది కాదన్నారు. తన మాటకు విలువ లేకపోవడం వల్లే రాజకీయంగా మరో నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు.

**ద్రోహి అంటూ విమర్శలపై ఆగ్రహం**

ఆప్‌ను వీడిన తర్వాత తనపై పార్టీ నేతలు విమర్శలు చేయడాన్ని హర్భజన్ తప్పుబట్టారు. తన ఇంటి వద్ద నిరసనలు చేపట్టి దిష్టిబొమ్మ దహనం చేయడంపై స్పందిస్తూ.. తాను ఎవరినీ మోసం చేయలేదన్నారు. క్రికెట్ వల్లే ప్రజలు తనను అభిమానించారని, పంజాబ్ కోసం పార్టీ చేసిన పనులపై ముందుగా సమాధానం చెప్పాలని వ్యాఖ్యానించారు.

# విదేశాంగ విధానంపై రాహుల్ సెటైర్లు

- కౌగిలింతలతో దౌత్యం కాదంటూ ప్రధాని మోదీపై విమర్శలు
- సందీప్ దీక్షిత్‌తో వేదికపైనే రాహుల్ కౌగిలింత
- మెలోనీ ప్రస్తావనతో వైరల్‌గా మారిన వ్యాఖ్యలు
- సోషల్ మీడియాలో వీడియోపై భిన్న స్పందనలు



**న్యూఢిల్లీ, ఆగస్టు 13, (సిరి న్యూస్):**

కేంద్ర ప్రభుత్వ విదేశాంగ విధానాన్ని లక్ష్యంగా చేసుకుని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సెటైర్లు వేశారు. ఇతర దేశాల నేతలను కౌగిలించుకోవడమే విదేశాంగ విధానం కాదంటూ ప్రధాని నరేంద్ర మోదీని ఉద్దేశించి విమర్శించారు. ఢిల్లీలోని మావలాంకర్ హాల్‌లో గురువారం జరిగిన 'రచనాత్మక కాంగ్రెస్' జాతీయ సదస్సులో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

**కౌగిలింతతో వ్యంగ్యం**

విదేశాంగ విధానంపై మాట్లాడిన రాహుల్ గాంధీ.. కాంగ్రెస్ నేత సందీప్ దీక్షిత్‌ను వేదిక పైకి పిలిచారు. అనంతరం ఆయనను కౌగిలించుకుంటూ ప్రధాని మోదీ విదేశాంగ విధానాన్ని వ్యంగ్యంగా ప్రస్తావించారు. కేవలం ఇతర దేశాల నేతలను కౌగిలించుకోవడం ద్వారా దౌత్య విధానాన్ని నిర్వచించలేమని వ్యాఖ్యానించారు.

**మెలోనీ ప్రస్తావనతో నవ్వులు**

ఈ సందర్భంగా సందీప్ దీక్షిత్ ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీ పేరును ప్రస్తావించారు. రాహుల్‌ను ఉద్దేశించి ఓ ప్రశ్న వేయడంతో సభలో నవ్వులు వెల్లువెత్తాయి. దీనికి రాహుల్ కూడా సరదాగా స్పందించారు. ఈ సంభాషణకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది.

**విదేశాంగ విధానంపై విమర్శలు**

ప్రధాని మోదీ అనుసరిస్తున్న విదేశాంగ విధానంలో వ్యక్తిగత దౌత్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారన్నది రాహుల్ గాంధీ విమర్శల ప్రధాన ఉద్దేశంగా కనిపించింది. అంతర్జాతీయ సంబంధాలను కేవలం నేతల మధ్య వ్యక్తిగత సమావేశాలు, కౌగిలింతలతో చూడకుండా విధానాలు, ఫలితాల ఆధారంగా అంచనా వేయాలని ఆయన వ్యాఖ్యల ద్వారా సూచించారు.

**రాజకీయంగా దుమారం**

రాహుల్ వ్యాఖ్యలు, మెలోనీ ప్రస్తావనపై అధికార పక్ష నేతలు విమర్శలు గుప్పించారు. విదేశాంగ విధానంపై ప్రభుత్వాన్ని ప్రశ్నించేందుకు ప్రతిపక్షానికి హక్కు ఉన్నప్పటికీ, వ్యక్తిగత వ్యాఖ్యలు చేయడం సరికాదని బీజేపీ నేతలు పేర్కొన్నారు. దీంతో 'రచనాత్మక కాంగ్రెస్' వేదికగా జరిగిన ఈ వ్యాఖ్యలు రాజకీయంగా మరోసారి చర్చనీయాంశంగా మారాయి.

## దేశభక్తి నినాదాలతో నిర్వహించిన సార్వజనిక తిరంగ ర్యాలీ.

హాజరైన గిరివర్ధన్ రెడ్డి మరియు డా. ఎస్.మల్లారెడ్డి.



**కొంపల్లి. ఆగష్టు.13(సిరి న్యూస్).**

కొంపల్లి బీజేపీ అధ్యక్షులు పెద్దబుద్దుల సతీష్ సాగర్ ఆధ్వర్యంలో ఎన్.సి.ఎల్ కాలనీ నుండి వెన్ సాయి ప్రాజెక్టు వరకు నిర్వహించిన సార్వజనిక తిరంగ ర్యాలీ దేశభక్తి నినాదాలతో మారుమోగింది.ఈ కార్యక్రమానికి మేడ్చల్ అర్బన్ జిల్లా బీజేపీ అధ్యక్షులు డి.గిరివర్ధన్ రెడ్డి, కన్వీనర్ డా.ఎస్. మల్లారెడ్డి, ఉపాధ్యక్షులు ఆదిరెడ్డి రాజిరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా సతీష్ సాగర్ మాట్లాడుతూ గౌరవ భారత ప్రధాని శ్రీ నరేంద్ర మోదీ పిలుపుతో భారతమాత ముద్దుబిడ్డలుగా జాతి సమీక్యతను చాటుతూ ఈ తిరంగ ర్యాలీ నిర్వహించడం జరిగిందని అన్నారు.కార్యక్రమాన్ని ఉద్దేశించి ముఖ్య అతిథులు మాట్లాడుతూ, అనాటి స్వతంత్ర సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ యువతలో దేశభక్తిని చాటేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో సాయి చైతన్య కాలేజీ విద్యార్థులతో పాటు బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యులు ఎడమ జనార్ధన్ రెడ్డి.తిరంగ యాత్ర కోఆర్డినేటర్ మహేందర్ సాగర్.స్థానిక నాయకులు శంకర్ నాయక్. మధు.ఆకుల శ్రీనివాస్.ప్రకాష్ రావు.మురళి కృష్ణ.సంతోష్ వర్మ.చెన్నరెడ్డి. తిరుపతి.శివ ప్రకాష్.లక్ష్మణ్.రాజేష్ మరియు స్థానికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఇంటర్ విద్యార్థులకు ఉచిత నోటు పుస్తకాలు పంపిణీ









**పెద్ద శంకరం పేట, ఆగస్టు 13, (సిరి న్యూస్):**

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు గురువారం నాడు ప్రభుత్వం సరఫరా చేసిన ఉచిత నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్య క్రమంలో ప్రిన్సిపాల్ శోభారాణి, అధ్యాపకులు అనంత్ రాజ్, మల్లేశం, ప్రభాకర్, రాజు, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

## తెల్లాపూర్ సమస్యల పరిష్కారానికి అధికారుల కసరత్తు..



- **తేనా విజ్ఞప్తితో క్షేత్రస్థాయి పరిశీలన..**
- **రూ.6 కోట్లతో ఆర్ ఆర్30 ఎక్స్ టెన్షన్ రీకార్పెటింగ్ కు చర్యలు**

**రామచంద్రపురం, ఆగస్టు 13 (సిరి న్యూస్):**

తెల్లాపూర్‌లో రోడ్లు, డ్రైనేజీ, ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి అధికారులు చర్యలు చేపట్టారు. తేనా విజ్ఞప్తి మేరకు సెరిలింగంపల్లి జోన్ జోనల్ కమిషనర్ నారాయణ అమిత్ మాలెంపాటి, ఐఏఎస్ గురువారం పలు ప్రాంతాల్లో క్షేత్రస్థాయి పరిశీలన నిర్వహించారు. ఎస్‌బీఐ బ్యాంక్–ఆర్‌ఆర్7 ప్రాంతంలో రోడ్లు, డ్రైనేజీ సమస్యలను పరిశీలించిన కమిషనర్.. టెండర్ ప్రక్రియ పూర్తయిందని, పనులు త్వరలో ప్రారంభిస్తామని తెలిపారు. తెల్లాపూర్–నల్లగండ్ల జంక్షన్, అలియన్స్ సర్కిల్ మీదుగా ఉన్న ఆర్‌ఆర్30 ఎక్స్‌టెన్షన్ రోడ్డు రీకార్పెటింగ్‌కు రూ.6 కోట్లు కేటాయించినట్లు వెల్లడించారు. మేఫెయిర్ అవెన్యూ, రాజ్‌పుష్ప సర్కిల్, బిర్లా ఓపెన్ మైండ్స్ స్కూల్ రోడ్డు సమస్యలపై కూడా అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేశారు. ప్రజా సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కార చర్యలు చేపట్టడంపై జోనల్ కమిషనర్‌కు తేనా అధ్యక్షుడు రమణ ఈశ్వరగారి కృతజ్ఞతలు తెలిపారు.

# హెచ్ఐవీ పై ప్రతి ఒక్కరికి అవగాహన తప్పనిసరి

- **యువత హెచ్ఐవి బారిన పడకూడదు.**
- **హెచ్ఐవి కి ప్రస్తుతం మందు లేదు నివారణే ముఖ్యం**
- **మెదక్ లోని బాలుర జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో హెచ్ఐవీపై అవగాహన.**
- **జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ గణేశ్వర్.**




**మెదక్ ఆగష్టు,13(సిరి న్యూస్)**

హెచ్ఐవి మహమ్మారిపై ప్రతి ఒక్కరికి అవగాహన తప్పకుండా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ గణేశ్వర్ పేర్కొన్నారు. గురువారం స్థానిక బాలుర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు హెచ్ఐవీ/ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ, హెచ్ఐవీకి ప్రస్తుతం పూర్తిస్థాయి నివారణ మందు లేదని, వ్యాధి బారిన పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడమే ముఖ్యమని తెలిపారు. యువత హెచ్ఐవీతో పాటు లైంగికంగా సంక్రమించే వ్యాధులపై అవగాహన పెంచుకోవాలని, అపోహలకు దూరంగా ఉండి బాధ్యతాయుతమైన జీవన విధానాన్ని పాటించాలని ఆయన సూచించారు. ఈ నెల 12వ తేదీ నుంచి రెండు నెలల పాటు జిల్లాలో హెచ్ఐవీ అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. పాఠశాలలు, కళాశాలలు, గ్రామీణ ప్రాంతాలు, యువజన కార్యక్రమాల ద్వారా అవగాహన కల్పించనున్నట్లు వివరించారు. మెదక్ జిల్లాలోని స్వచ్ఛంద సంస్థలు, స్కోప్ ఎన్జీవో, లింక్ వర్కర్ ప్రాజెక్ట్, ఐసీటీసీ కౌన్సిలర్లు, డీఎస్ఆర్‌సీ కౌన్సిలర్లు, హెచ్ఐవీ విభాగానికి సంబంధించిన సిబ్బంది సమన్వయంతో కార్యక్రమాలను విజయవంతం చేయాలని డీఎంహెచ్ఓ ఆదేశించారు. ఈ సందర్భంగా హెచ్ఐవీపై అవగాహన కల్పించే పోస్టర్‌ను విడుదల చేశారు. పోస్టర్‌లోని క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా వ్యక్తి హెచ్ఐవీకి సంబంధించి అధిక ప్రమాదం (హై రిస్క్) లేదా తక్కువ ప్రమాదం (లో రిస్క్) వర్గంలో ఉన్నారా అనే విషయాన్ని తెలుసుకునేందుకు కొన్ని ప్రశ్నలు అందుబాటులో ఉంటాయన్నారు.ప్రశ్నలకు సమాధానాల ఆధారంగా హెచ్ఐవీ పరీక్ష అవసరమైతే సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో పరీక్ష చేయించుకోవాలని సూచనలు అందు తాయని సూచించారు.ఈ కార్యక్రమంలో హెచ్ఐవీ/ఎయిడ్స్ అడిషనల్ డీఎంహెచ్ఓ డాక్టర్ హరికృష్ణ, స్థానిక హై స్కూల్ హెడ్మాస్టర్ మల్లేశం, ఐసీటీసీ కౌన్సిలర్లు గోపి, సుధాకర్, రవి, లైంగిక వ్యాధుల కౌన్సిలర్ రాజేశ్వర్, స్కోప్ ఎన్జీవో ప్రతినిధి ఉప్పలయ్య, లింక్ వర్కర్ ప్రోగ్రాం ప్రతినిధులు లక్ష్మణ్, అనిల్, ఔట్రీచ్ వర్కర్లు, పబ్లిక్ హెల్త్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా ప్రతినిధి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# యూరియా కోసం రైతన్న పడిగాపులు..

**యాప్ చుట్టూ ప్రదక్షిణలు**

**మెదక్ ఆగస్టు 13 సిరి న్యూస్**




జిల్లాలో యూరియా కోసం రైతులు పడుతున్న కష్టాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. పంటకు అవసరమైన సమయంలో ఎరువు అందుబాటులో ఉండాల్సి ఉండగా.. యూరియా తీసుకోవాలంటే ముందుగా ఫర్టిలైజర్ యాప్‌లో నమోదు చేసుకోవడం, కేవైసీ పూర్తి చేయడం ఆధార్ మొబైల్ నంబర్ పట్టాదారు పాసుపుస్తకం వివరాలు సరిపోల్చడం వంటి ప్రక్రియలు రైతులకు తలనొప్పిగా మారుతున్నాయి. యాప్‌లో నమోదు చేసేందుకు ప్రయత్నిస్తే సాంకేతిక సమస్యలు కేవైసీ వద్ద వివరాలు సరిపోకపోవడం ఓటీపీ ఆలస్యం కావడం నెట్‌వర్క్ లేకపోవడం సర్వర్ పనిచేయకపోవడం వంటి సమస్యలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని జిల్లాలోని పలు గ్రామాల రైతులు వాపోతున్నారు. పంట సాగులో ఎరువుల వినియోగం కీలకమైన సమయంలో యూరియా కోసం రైతు ఇబ్బందులు పడాల్సి రావడం ఆందోళన కలిగిస్తోంది తెల్లవారుజామునే పొలానికి వెళ్లాల్సిన రైతు యూరియా కోసం మాత్రం ఎరువుల దుకాణాల వద్దకు వెళ్లి గంటల తరబడి వేచి చూడాల్సి వస్తోందని చెబుతున్నారు. యూరియా కావాలంటే ముందుగా యాప్‌లో బుక్ చేసుకోవాలి అని దుకాణదారులు చెబుతుండటంతో స్మార్ట్‌ఫోన్ వినియోగం తెలియని వృద్ధ రైతులు ఇతరుల సహాయం తీసుకోవాల్సి వస్తోంది ఫర్టిలైజర్ యాప్ ద్వారా యూరియా పంపిణీలో పారదర్శకత తీసుకురావడం అర్హులైన రైతులకే ఎరువు అందించడం ఎరువుల నిల్వలు విక్రయాలను పర్యవేక్షించడం లక్ష్యంగా ఈ విధానాన్ని అమలు చేస్తున్నారు. విధానం ఉద్దేశం మంచిదే అయినా క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సాంకేతిక సమస్యలకు సత్వర పరిష్కారం చూపకపోతే అసలు లక్ష్యమే దెబ్బతినే పరిస్థితి ఉందని రైతులు అంటున్నారు వాన కోసం ఆకాశం వైపు చూసే రైతు ఇప్పుడు యాప్ పనిచేస్తుందా లేదా అని ఫోన్ వైపు చూడాల్సిన పరిస్థితి వచ్చిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంటకు ఎరువు వేసే సమయంలో ఒక్కరోజు ఆలస్యం జరిగినా పంట ఎదుగుదలపై ప్రభావం పడే అవకాశం ఉంది. అలాంటి సమయంలో యాప్‌లో బుకింగ్ కాకపోవడం కేవైసీ పూర్తికాకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గతంలో ఎరువుల దుకాణానికి వెళ్లి అవసరమైన ఎరువు తీసుకుని నేరుగా పొలానికి వెళ్లేవారు. ఇప్పుడు ముందుగా యాప్‌లో నమోదు తర్వాత కేవైసీ ఆపై బుకింగ్ డీలర్ వద్ద నిర్ధారణ చివరకు యూరియా తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది ఈ ప్రక్రియలో ఏ ఒక్క దశలో సమస్య వచ్చినా రైతు మళ్లీ మొదటి నుంచి ప్రయత్నించాల్సి వస్తోందని చెబుతున్నారు.

### కేవైసీ దగ్గరే కష్టాల కంచె

యూరియా పొందడానికి రైతు వివరాలు డిజిటల్ రికార్డులతో సరిపోలడం కీలకంగా మారింది. భూమి ఒకరి పేరుతో ఉండి సాగు మరొకరు చేస్తున్న సందర్భాల్లో సమస్యలు తలెత్తుతున్నాయి ముఖ్యంగా కుటుంబంలో భూమి యజమాని మరణించినా రికార్డుల్లో మాత్రం ఆయన పేరే కొనసాగుతున్న సందర్భాల్లో వారసులు ఇబ్బందులు పడుతున్నారని రైతులు చెబుతున్నారు. భూమి రికార్డుల్లో మరణించిన వ్యక్తి పేరు ఉండటం.. ప్రస్తుతం ఆ భూమిని వారసులు సాగు చేయడం యాప్‌లో మాత్రం పాత పట్టాదారు వివరాలు కనిపించడం వంటి సమస్యలు ఎదురవుతున్నాయి. ఆధార్ మొబైల్ నంబర్, కేవైసీ వివరాలు సరిపోకపోవడంతో యూరియా బుకింగ్ ముందుకు సాగడం లేదని రైతులు వాపోతున్నారు భూమి మాది పంట మేమే సాగు చేస్తున్నాం. కానీ రికార్డుల్లో మా తండ్రి పేరు ఉంది. ఆయన చనిపోయి ఏళ్లు అవుతోంది. ఇప్పుడు ఆయన పేరుతో కేవైసీ ఎలా చేయాలి అని పలువురు రైతులు ప్రశ్నిస్తున్నారు. ఇలాంటి సమస్యలను అధికారులు ప్రత్యేకంగా పరిశీలించి పరిష్కరించాల్సిన అవసరం ఉందని రైతులు కోరుతున్నారు. వారసత్వ మార్పులు పూర్తికాని భూములకు ప్రత్యేక విధానం తీసుకొచ్చి వాస్తవంగా సాగు చేస్తున్న అర్హులైన రైతుకు ఎరువు అందేలా చూడాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

### కౌలు రైతులకు మరింత ఇక్కట్లు

జిల్లాలో కౌలు రైతుల సమస్య మరోలా ఉంది. భూమి యజమాని ఒకరు సాగు చేస్తున్న రైతు మరొకరు. కౌలు తీసుకుని పంట సాగు చేస్తున్న రైతే విత్తనం వేస్తాడు ఎరువులు వేస్తాడు పురుగుమందులు పిచికారీ చేస్తాడు పంటను కాపాడుకుంటాడు. కానీ భూమి రికార్డులో మాత్రం యజమాని పేరు ఉంటుంది. ఇలాంటి సందర్భాల్లో ఫర్టిలైజర్ యాప్‌లో వివరాలు సరిపోలకపోతే కౌలు రైతు యూరియా కోసం ఎవరిని ఆశ్రయించాలన్నది సమస్యగా మారుతోంది. భూమి యజమాని అందుబాటులో లేకపోయినా వాస్తవంగా సాగు చేస్తున్న రైతుకు అవసరమైన ఎరువు అందేలా నిబంధనలు సరళీకరించాలని కౌలు రైతులు కోరుతున్నారు.

### వృద్ధ రైతులకు సాంకేతిక తిప్పలు

స్మార్ట్‌ఫోన్ వినియోగంపై అవగాహన లేని వృద్ధ రైతులకు ఫర్టిలైజర్ యాప్ మరింత ఇబ్బందికరంగా మారుతోంది. యాప్ డౌన్‌లోడ్ చేయడం, వివరాలు నమోదు చేయడం, ఓటీపీ గుర్తించడం, ఆధార్ వివరాలు ఇవ్వడం, కేవైసీ పూర్తి చేయడం వంటి ప్రక్రియలు వారికి అంత సులభం కాదు. దీంతో పిల్లలు, యువకులు, పరిచయస్తులు, ఎరువుల దుకాణదారుల సహాయం తీసుకోవాల్సి వస్తోందని రైతులు చెబుతున్నారు. ఒకవేళ వారి సహాయం అందుబాటులో లేకపోతే యూరియా బుకింగ్ చేయడం కూడా కష్టంగా మారుతోందని అంటున్నారు.

### సర్వర్ సమస్యతో పడిగాపులు

గ్రామీణ ప్రాంతాల్లో మొబైల్ నెట్‌వర్క్ సమస్యలు కూడా రైతులను వేధిస్తున్నాయి. యాప్‌లో నమోదు చేసుకునే సమయంలో నెట్‌వర్క్ నిలిచిపోతే ప్రక్రియ మధ్యలోనే ఆగిపోతోంది. ఓటీపీ కోసం వేచి చూడాల్సి వస్తోంది. సర్వర్ నెమ్మదిస్తే ఒక రైతు బుకింగ్‌కు ఎక్కువ సమయం పడుతోంది. దీంతో ఎరువుల దుకాణాల వద్ద రైతుల సంఖ్య పెరుగుతోంది. యాప్‌లో సమస్య వచ్చిందని చెప్పినా దానికి ప్రత్యామ్నాయ మార్గం ఏమిటో రైతులకు స్పష్టంగా తెలియడం లేదని కొందరు చెబుతున్నారు. దీంతో ఒకే సమస్య పరిష్కారం కోసం పలుమార్లు తిరగాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### బుకింగ్ అయింది.. యూరియా ఎక్కడ

మరోవైపు యాప్‌లో బుకింగ్ పూర్తయిన తర్వాత కూడా రైతుకు యూరియా ఎక్కడ లభిస్తుంది అన్నది కీలకంగా మారుతోంది. బుకింగ్ చేసిన డీలర్ వద్ద ఆ సమయంలో స్టాక్ లేకపోతే పరిస్థితి ఏమిటన్నది రైతుల ప్రశ్న. యూరియా నిల్వలు ఏ గ్రామంలో ఉన్నాయి ఏ సొసైటీకి ఎంత వచ్చింది ఏ డీలర్ వద్ద ఎంత స్టాక్ ఉంది బుకింగ్ చేసిన రైతులు ఎప్పుడు తీసుకోవాలి వంటి వివరాలను గ్రామస్థాయిలో ముందుగానే ప్రకటిస్తే రైతుల ఇబ్బందులు తగ్గుతాయని రైతులు అంటున్నారు.

### యాప్ బాగుంది.. విధానం సులభం కావాలి

డిజిటల్ విధానానికి రైతులు వ్యతిరేకం కాదని కానీ అది తమకు సులభంగా ఉండాలని కోరుతున్నారు. అక్రమాలకు అడ్డుకట్ట వేయడానికి, అర్హులైన రైతులకు ఎరువు అందించడానికి సాంకేతిక విధానం ఉపయోగపడితే మంచిదేనని అంటున్నారు. అయితే అదే సమయంలో నిజంగా పంట సాగు చేస్తున్న రైతు యూరియా కోసం ఇబ్బందులు పడకూడదని స్పష్టం చేస్తున్నారు. యాప్‌లో బుకింగ్ చేయలేని రైతుల కోసం ప్రత్యామ్నాయంగా మీసేవ కేంద్రాల ద్వారా బుకింగ్ సదుపాయం కల్పించినప్పటికీ రికార్డుల సమస్య ఉన్న రైతులకు అక్కడ కూడా ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని రైతులు అంటున్నారు.

### గ్రామంలోనే పరిష్కారం చూపాలి

యూరియా కోసం రైతు మండల కేంద్రం వరకు వెళ్లాల్సిన అవసరం లేకుండా గ్రామ స్థాయిలోనే సమస్య పరిష్కరించే విధానం ఉండాలని రైతులు కోరుతున్నారు. వ్యవసాయశాఖ సిబ్బంది ఆధ్వర్యంలో ప్రత్యేక సహాయ కేంద్రం ఏర్పాటు చేసి యాప్ బుకింగ్ కేవైసీ ఆధార్ మొబైల్ భూమి రికార్డుల సమస్యలను పరిశీలించి పరిష్కరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ముఖ్యంగా మరణించిన పట్టాదారుల పేర్లతో ఉన్న భూములను గుర్తించి వారసుల వివరాలను పరిశీలించి.. వాస్తవంగా సాగు చేస్తున్న రైతుకు ఎరువు అందేలా ప్రత్యేక విధానం రూపొందించాలని కోరుతున్నారు.

### రైతు సమయం కూడా విలువైనదే

రైతుకు పొలంలో ప్రతి రోజు విలువైనదే. పంటకు ఎరువు వేయాల్సిన సమయంలో యూరియా కోసం రోజులు తరబడి తిరగాల్సి వస్తే సాగు పనులు దెబ్బతింటాయి. ఒకవైపు పెట్టుబడులు పెరుగుతుండగా మరోవైపు ఎరువు కోసం సమయం, డబ్బు ఖర్చు చేయాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. యాప్ కోసం మా పంటను ఆపలేం కేవైసీ కోసం పొలాన్ని వదిలి తిరగలేం అధికారులు మా సమస్యను అర్థం చేసుకుని సులభమైన మార్గం చూపాలిఅని రైతులు కోరుతున్నారు.

### అధికారుల చొరవ అవసరం

జిల్లాలో యూరియా బుకింగ్ ఫర్టిలైజర్ యాప్ కేవైసీ సమస్యలపై వ్యవసాయశాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని రైతులు కోరుతున్నారు. గ్రామాల వారీగా సమస్యలను సేకరించి ఏ ప్రాంతంలో ఏ సమస్య ఎక్కువగా ఉందో గుర్తించి తక్షణ పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

మరణించిన పట్టాదారుల పేర్లతో ఉన్న భూములు, వారసత్వ మార్పులు పూర్తికాని భూములు, కౌలు రైతులు, మొబైల్ నంబర్ మారిన రైతులు, ఆధార్ వివరాలు సరిపోని రైతుల సమస్యలకు ప్రత్యేక పరిష్కారం, చూపాల్సిన అవసరం ఉంది. యూరియా పంపిణీలో సాంకేతికత తీసుకురావడం మంచిదే. కానీ ఆ సాంకేతికత కారణంగా నిజమైన రైతు నష్టపోకూడదు. యాప్ రైతుకు సహాయక సాధనంగా ఉండాలి తప్ప యూరియా పొందేందుకు అడ్డంకిగా మారకూడదని రైతాంగం కోరుతోంది.

# గీతంలో ఘనంగా ఫ్రెషర్స్ పార్టీ





- **నూతన విద్యార్థులను స్వాగతించిన స్కూల్ ఆఫ్ బిజినెస్, సైన్స్, ఫార్మసీ, ఆర్కిటెక్చర్, హ్యుమానిటీస్**

**పటాన్ చెరు, ఆగస్టు 13, (సిరి న్యూస్):**

గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, హైదరాబాదు లోని స్కూల్ ఆఫ్ బిజినెస్, సైన్స్, ఫార్మసీ, ఆర్కిటెక్చర్, హ్యుమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ ఆధ్వర్యంలో 2026-27 బ్యాచ్ కు ఘనంగా ఫ్రెషర్స్ పార్టీని నిర్వహించారు. నూతన విద్యార్థులను ఘనంగా స్వాగతించారు. సంగీతం, నృత్యం, స్కిట్లు, ర్యాంప్ వాక్ లు, విద్యార్థుల ఉత్సాహభరితమైన ప్రదర్శనలతో గీతం ప్రాంగణమంతా కళకళలాడింది. ఫుడ్ స్టాల్స్, ఆటలు, ఫోటోబూత్ లు పండుగ వాతావరణాన్ని మరింత పెంచాయి. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఫ్రెషర్స్ కు తమ ప్రతిభను ప్రదర్శించ డానికి, తోటి విద్యార్థులు, సీనియర్లతో మమేకమవ్వడానికి ఒక అవకాశాన్ని కల్పించాయి. విద్యార్థులు నేర్చుకోవ డానికి, ఒకరితో ఒకరు మమేకమవ్వడాని కి, తమను తాము వ్యక్తీకరించుకోవడానికి, చిరస్మరణీయమైన జ్ఞాపకాల ను నిర్మించుకోవడానికి ప్రోత్సహించే ఉత్సాహ భరితమైన ప్రాంగణ వాతావరణాన్ని సృష్టించాల నే గీతం నిబద్ధతను ఈ కార్యక్రమం ప్రతిబింబించింది. తమ విశ్వ విద్యాలయ ప్రయాణానికి ఒక చిరస్మరణీయమైన ఆరంభాన్ని అందించినందుకు ఫ్రెషర్స్ తమ సీనియర్లకు కృతజ్ఞతలు తెలియజేయడంతో, ఈ వేడుకలు విజయ వంతంగా ముగిశాయి.



# మురుగు నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం





**పటాన్ చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి**

**పటాన్ చెరు, ఆగస్టు 13, (సిరి న్యూస్):**

ముత్తంగి డివిజన్, ఇస్నాపూర్ మున్సిపల్ పరిధిలోని సరిహద్దు కాలనీల ప్రజలు ఎదుర్కొంటున్న మురుగు నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు చేపడుతున్నామని పటాన్ చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. గురువారం సాయంత్రం ఇస్నాపూర్ మున్సిపల్, ముత్తంగి డివిజన్ ఇంజనీరింగ్ శాఖల అధికారులతో కలిసి కాలనీలలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముత్తంగి డివిజన్ పరిధిలోని వివిధ కాలనీల నుండి వచ్చే మురుగు నీటిని ఇస్నాపూర్ మున్సిపల్ పరిధిలోని యుజిడిల ద్వారా తరలించాల్సి వస్తోందని తెలిపారు. యుజిడిల పైపు సామర్థ్యం తక్కువ ఉండడం మూలంగా నిరంతరం సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయని ఆయా శాఖల అధికారులు ఎమ్మెల్యే జిఎంఆర్ దృష్టికి తీసుకెళ్లారు. రెండు శాఖల అధికారులు సమన్వయంతో జనాభాకు అనుగుణంగా నూతన అంతర్గత మురుగు నీటి కాలువల పైపులైన్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుని వెళ్లి అతి త్వరలో నిధులు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఇస్నాపూర్ మున్సిపల్ కమిషనర్ వెంకట కిషన్ రావు, డిఈలు కృష్ణవేణి, నరసింహ రావు, మాజీ జడ్పీటీసీ శ్రీకాంత్ గౌడ్, సీనియర్ నాయకులు శ్రీకాంత్, కౌన్సిలర్లు ఆంజనేయులు, వెంకటేష్, మేరాజ్ ఖాన్, నిజాముద్దీన్ బాబా, అబిద్, కాలనీల ప్రజలు పాల్గొన్నారు.

# గ్రీన్ హైడ్రోజన్ రంగంలో కీలక ముందడుగు..

**హైస్టార్ ఏఎస్‌తో బీహెచ్ఈఎల్ ఒప్పందం**

**రామచంద్రపురం, ఆగస్టు 13 (సిరి న్యూస్) :**




గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్టులకు అవస రమైన పీఈఎం (ప్రోటాన్ ఎక్స్చేంజ్ మెంబ్రేన్) ఎలక్ట్రోలైజర్ వ్యవస్థలను దేశీయంగా తయారు చేసేందుకు భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్ (బీహెచ్ఈఎల్), నార్వేకు చెందిన హైస్టార్ ఏఎస్‌తో వ్యూహాత్మక ఒప్పందం కుదుర్చుకుంది. బీహెచ్ఈఎల్ తరపున ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె. శ్రీనివాస్, జనరల్ మేనేజర్, న్యూ అండ్ రెన్యూవబుల్ ఎనర్జీ డివిజన్ అధిపతి కుల్‌దీప్ రాయ్, హైస్టార్ ఏఎస్ తరపున సంస్థ సీఈఓ ఫ్రెడ్రిక్ మోవిల్ ఒప్పందంపై సంతకాలు చేశారు. న్యూఢిల్లీలోని రాయల్ నార్వేజియన్ రాయబారి మే-ఎలిన్ స్టెనెర్‌తో పాటు బీహెచ్ఈఎల్ ఉన్నతాధి కారులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇప్పటికే ఆల్కలైన్ ఎలక్ట్రోలైజర్ వ్యవస్థల కోసం థైసెన్‌క్రుప్ న్యూసెరా ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌తో బీహెచ్ఈఎల్ ఒప్పందం చేసుకుంది. తాజా ఒప్పందంతో ఆల్కలైన్‌తో పాటు పీఈఎం రెండు రకాల ఎలక్ట్రోలైజర్ సాంకేతిక తలను అందించే సామర్థ్యం బీహెచ్ఈఎల్‌కు లభించింది. ఈ భాగస్వామ్యం 'మేక్ ఇన్ ఇండియా'కు, జాతీయ గ్రీన్ హైడ్రోజన్ మిషన్ లక్ష్యాలకు ఊతమివ్వడంతో పాటు దేశంలో గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్టుల విస్తరణకు దోహదపడుతుందని బీహెచ్ఈఎల్ పేర్కొంది.

# తెల్లాపూర్‌లో ప్రభుత్వ విద్యకు కొత్త రూపు..

- **రూ.48 కోట్లతో కేజీ నుంచి ఇంటర్ వరకు ఆధునిక పాఠశాల..**
- **ఆగస్టు 17న భూమిపూజ**
- **ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**

**రామచంద్రాపురం, ఆగస్టు 13 (సిరి న్యూస్):**



తెల్లాపూర్‌లో ప్రభుత్వ విద్యకు కొత్త రూపు తీసుకురావడమే లక్ష్యంగా రూ.48 కోట్ల అంచనా వ్యయంతో అత్యాధునిక ప్రభుత్వ పాఠశాల నిర్మాణానికి రంగం సిద్ధమైంది. ఎకరా విస్తీర్ణంలో నిర్మించనున్న ఈ పాఠశాలలో కేజీ నుంచి ఇంటర్మీడియట్ వరకు ఒకే ప్రాంగణంలో విద్యాబోధన అందించనున్నారు. గురువారం పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అధికారులతో కలిసి సర్వే నంబర్ 323లో, గద్దర్ విగ్రహం వెనుక ఉన్న పాఠశాల నిర్మాణ స్థలాన్ని పరిశీ లించారు. నిర్మాణ ప్రణాళిక, మౌలిక వసతులు, ఇతర ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేద, మధ్యతరగతి విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యను ఉచితంగా అందించడమే లక్ష్యమన్నారు. డిజిటల్ తరగతి గదులు, ఆధునిక సైన్స్, కంప్యూటర్ ల్యాబ్‌లు, లైబ్రరీలు, విశాలమైన క్రీడా మైదానాలతో పాఠశాలను తీర్చిదిద్దనున్నట్లు తెలిపారు. తెల్లాపూర్‌తో పాటు పరిసర ప్రాంతాల్లోని వందలాది మంది విద్యార్థులకు ఈ పాఠశాల ప్రయోజనం చేకూర్చనుందని పేర్కొన్నారు. ఆగస్టు 17న భూమిపూజ నిర్వహించి నిర్మాణ పనులు ప్రారంభించ నున్నట్లు వెల్లడించారు. పనులను నాణ్యతా ప్రమాణాలతో వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. aకార్యక్రమంలో పటాన్‌చెరు సర్కిల్ డిప్యూటీ కమిషనర్ జ్యోతి రెడ్డి, సీనియర్ నాయకులు సోమిరెడ్డి, దేవేందర్ యాదవ్, మాజీ కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు షూలు.. సమానత్వం బాట..



- **విద్యార్థులంతా సమానమే.. షూల పంపిణీ..**
- **పేద, ధనిక భేదం వద్దు.. సమానత్వమే లక్ష్యం..**
- **విద్యతో పాటు క్రమశిక్షణకు పెద్దపీట..**

**మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఆగస్టు 13 (సిరి న్యూస్)**

విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు క్రమశిక్షణ, సమానత్వ భావనను పెంపొందించేందుకు నెన్నెల్ మండలం మన్నెగూడ గ్రామంలోని పాఠశాలలో విద్యార్థులకు షూలను పంపిణీ చేశారు. పేద, ధనిక అనే తేడా లేకుండా ప్రతి విద్యార్థి సమానమేనని, అందరూ భారతీయ బిడ్డలేననే భావనను చిన్ననాటి నుంచే పెంపొందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచన మేరకు, బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ సహకారంతో కార్యక్రమం చేపట్టారు. విద్యార్థులు మంచి నైపుణ్యాలను అలవర్చుకుని విద్యలో రాణించడంతో పాటు క్రమశిక్షణతో ముందుకు సాగాలని నిర్వాహకులు ఆకాంక్షించారు. పాఠశాల చైర్మన్ గోలేటి సంధ్య, ప్రధానోపాధ్యాయురాలు మాలతి, గ్రామ సర్పంచ్ ధరావత్ మధుకర్, ఉపసర్పంచ్ పుష్పలత ఆధ్వర్యంలో విద్యార్థులకు షూలు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల కార్యదర్శి, క్షేత్రస్థాయి సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. విద్యార్థుల సౌకర్యం, ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణకు ప్రాధాన్యం ఇస్తూ ఇలాంటి కార్యక్రమాలను కొనసాగి స్తామని నిర్వాహకులు తెలిపారు.

## తోటి హోంగార్డు కుటుంబానికి ఆపన్నహస్తం..

- **లక్ష్మణ్ కుటుంబానికి రూ.48 వేల సాయం..**
- **తోటి హోంగార్డుల మానవత్వం..**
- **ఆపదలో ఒక్కటైన హోంగార్డులు..**



**మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఆగస్టు 13 (సిరి న్యూస్)**

అకాల మరణంతో కుటుంబానికి పెద్ద దిక్కును కోల్పోయిన దివంగత హోంగార్డు లక్ష్మణ్ కుటుంబానికి తోటి హోంగార్డులు అండగా నిలిచి మానవత్వాన్ని చాటుకున్నారు. రామకృష్ణాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో హోంగార్డుగా విధులు నిర్వహిస్తూ ఇటీవల మృతిచెందిన లక్ష్మణ్ కుటుంబానికి రామగుండం కమిషనరేట్ పరిధిలోని మంచిర్యాల జిల్లా హోంగార్డులు ఆర్థిక సహాయం అందించారు. లక్ష్మణ్ ఆకస్మిక మరణంతో విషాదంలో ఉన్న కుటుంబానికి అండగా నిలవాలనే ఉద్దేశంతో జిల్లాలోని హోంగార్డులు ఐక్యంగా ముందుకొచ్చారు. ప్రతి ఒక్కరూ తమ వంతుగా విరాళాలు సేకరించి రూ.48 వేల ఆర్థిక సహాయాన్ని లక్ష్మణ్ కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా హోంగార్డు సిబ్బంది మాట్లాడుతూ, సహచర ఉద్యోగికి ఆపద వచ్చినప్పుడు అందరం ఒక్కటిగా నిలవడమే హోంగార్డు వ్యవస్థ ప్రత్యేకత అని తెలిపారు. లక్ష్మణ్ కుటుంబానికి అండగా నిలవడం ద్వారా హోంగార్డుల ఐక్యత, మానవత్వం, బాధ్యతను చాటిచెప్పామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి రామగుండం కమిషనరేట్ ఆర్ఐ పెద్దయ్య, ఏఆర్ఎస్ఐ రామ్‌సింగ్ నేతృత్వం వహించారు. హోంగార్డు సిబ్బంది సురేష్, శ్రావణ్, రాజన్న, సదానందం, తిరుపతి, లక్ష్మణ్, మహేష్తో పాటు మంచిర్యాల జిల్లాకు చెందిన పలువురు హోంగార్డులు పాల్గొన్నారు. సహచరుడి కుటుంబానికి అండగా నిలిచిన హోంగార్డుల సేవాభావం స్థానికంగా ప్రశంసలు అందుకుంది.

## తెలంగాణ పబ్లిక్ స్కూల్ ను తరలించొద్దని యువత రిలే దీక్షలు



**వెల్దుర్తి,ఆగస్టు 13,(సిరి న్యూస్ ):**

మెదక్ జిల్లా వెల్దుర్తి మండల కేంద్రానికి మంజూరు చేసిన తెలంగాణ పబ్లిక్ స్కూల్ ను పక్కనే ఉన్న కుకునూరు గ్రామానికి తరలించడంపై స్థానిక యువత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దానిలో భాగంగానే గురువారం మండల కేంద్రంలో రిలే దీక్షలు ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షుడు కోదండశేఖర్ గౌడ్,నాళ్ళ చెరువు నరేందర్ గౌడ్,మాట్లాడుతూ వెల్దుర్తిలో అన్ని రకాల మౌలిక సదుపాయాలు, రవాణా సౌకర్యాలు అందుబాటులో ఉన్నప్పటికీ వెల్దుర్తిని కాదని పక్క గ్రామానికి పాఠశాలను తరలించడం ఎందుకు అంటూ యువ నాయకులు ప్రశ్నించారు. పాఠశాల తరలింపును నిరసిస్తూ వెల్దుర్తి బస్టాండ్ చౌరస్తా వద్ద యువ నాయకులు రిలే దీక్ష చేపట్టారు. పాఠశాలను వెల్దుర్తి లోనే ఏర్పాటు చేయాలని విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని అధికారులు నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. వెల్దుర్తికి మంజూరైన పాఠశాల పక్క గ్రామానికి ఎందుకు తరలిస్తున్నారు. అన్ని సౌకర్యాలు ఉన్న వెల్దుర్తిని కాదని, తీసుకున్న నిర్ణయం వెనుక కారణం ఏంటి అంటూ యువత ఆగ్రహం వ్యక్తం చేశారు.. ప్రభుత్వ అధికారులు వెంటనే స్పందించి పాఠశాల తరలింపు నిర్ణయాన్ని పునః పరిశీలించాలని యువ నాయకులు కోరారు. తెలంగాణ మోడల్ పబ్లిక్ స్కూల్ ను వెల్దుర్తిలో ఏర్పాటు చేసే వరకు మా యువకుల రిలే దీక్షలు ఆగవని, పాఠశాల ఏర్పాటు చేసే వరకు మా ఉద్యమం ఆగదని వారు హెచ్చరించారు. గ్రామ సర్పంచ్ ఆదర్శ్, చందు, శ్రీనివాస్, నవీన్ పటేల్, ప్రవీణ్, శివలింగం, ముకుందం తదితరులు పాల్గొన్నారు.

# రామాయంపేటలో అన్నదాతల రాస్తారోకో

- కొత్త యూరియా యాప్‌తో రైతుల ఇబ్బందులు..
- సొసైటీ కార్యాలయం వద్ద పడి గాపులు.
- ఎస్సైకి, బిజెపి నేత రాగి రాములు మధ్య వాగ్వి వాదం.
- పోలీసులు చెప్పడంతో ఆందోళన విరమణ






**రామాయంపేట, ఆగస్టు 13 (సిరి న్యూస్)**

కొత్త యూరియా యాప్ విధానంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. యూరియా కోసం ఉదయం నుంచే రైతులు రామాయంపేటలోని సొసైటీ కార్యాలయం వద్ద పడిగాపులు కాశారు. గంటల తరబడి ఎదురుచూసినా సరిపడా యూరియా అందక పోవడంతో ఆగ్రహించిన రైతులు రాస్తారోకో చేపట్టి నిరసన తెలిపారు. కొత్త యాప్ ద్వారా యూరియా పంపిణీ చేయడం వల్ల రైతులకు సాంకేతిక సమస్యలు, సమయాభావం వంటి ఇబ్బందులు ఎదురవుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో మాదిరిగానే పాత పద్ధతిలో యూరియా సరఫరా చేసి రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని డిమాండ్ చేశారు. యూరియా యాప్ ద్వారా రైతులకు ఇబ్బందులు ఎదురవుతున్నందున గతంలో మాదిరిగా యూరియా రైతులకు ఇవ్వాలని బిజెపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రాగి రాములు డిమాండ్ చేశారు. ఈ దశలో ఆయనకు, స్థానిక ఎస్సై కి మధ్య కొద్దిసేపు వాగ్వి వాదం జరిగింది. సొసైటీ కార్యాలయం వద్ద రైతులు నిరసన చేపట్టడంతో పోలీసులు అక్కడికి చేరుకున్నారు. ఎస్సై బాలరాజు రైతులతో మాట్లాడి పరిస్థితిని వివరించి, వారికి నచ్చజెప్పారు. రైతులు మాత్రం తమకు అవసరమైన మేరకు వెంటనే యూరియా అందించాలని డిమాండ్ చేశారు. యూరియా కొరతతో రైతులు ఇబ్బందులు పడకుండా ప్రభుత్వం, అధికారులు తక్షణమే స్పందించి రైతులకు సరిపడా యూరియా నిల్వలు అందుబాటులో ఉంచి, సులభమైన విధానంలో పంపిణీ చేయాలని రైతులు కోరారు.



# రామాయంపేట వై జంక్షన్ వద్ద సర్వీస్ రోడ్డు నిర్మాణానికి చర్యలు

- ఎమ్మెల్యే రోహిత్ రావు ఆదేశాలతో కదిలిన మున్సిపల్ పాలకవర్గం.
- సర్వీసు రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం.
- ప్రజల భద్రత మాకు ముఖ్యం.
- కౌన్సిలర్ గజవాడ నాగరాజు గుప్తా.
- గోల్పర్తి, కోమటిపల్లి రైతులకు ప్రత్యామ్నాయ మార్గాలు.





**రామాయంపేట, ఆగస్టు 13 (సిరి న్యూస్)**

రోడ్డు ప్రమాదాల నివారణ, ప్రజల భద్రతే లక్ష్యంగా రామాయంపేట వై జంక్షన్ వద్ద సర్వీస్ రోడ్డు నిర్మాణానికి రామాయంపేట మున్సిపల్ పాలకవర్గం చర్యలు చేపట్టింది. మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు ఆదేశాలతో మున్సిపల్ పాలక వర్గం యంత్రాంగం కదిలి సర్వీస్ రోడ్డు నిర్మాణానికి అవసరమైన పనులను ప్రారంభించింది. వై జంక్షన్ వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో ఉన్న తాధికారులు జంక్షన్‌ను మూసివేయాలని నిర్ణయించిన విషయం తెలిసిందే. అయితే జంక్షన్ మూసివేస్తే గోలిపర్తి, కోమటిపల్లి ప్రాంతాలకు చెందిన రైతులు, స్థానిక ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉండటంతో ప్రత్యామ్నాయంగా సర్వీస్ రోడ్డు నిర్మాణానికి చర్యలు చేపట్టారు. సర్వీస్ రోడ్డు నిర్మాణ పనులను రామాయంపేట సీఐ సైదా నాయక్, ఎస్సై బాలరాజు పరిశీలించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, రాకపోకలకు సౌకర్యంగా ఉండేలా పనులు చేపట్టాలని సూచించారు.ఈ సందర్భంగా మున్సిపల్ కౌన్సిలర్ గజవాడ నాగరాజు గుప్తా మాట్లాడుతూ వై జంక్షన్ వద్ద ప్రమాదాలను అరికట్టడంతో పాటు రైతులు, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సర్వీస్ రోడ్డు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని ఎమ్మెల్యే రోహిత్ రావు ప్రత్యేకంగా సర్వీస్ రోడ్డు నిర్మాణానికి చర్యలు చేపట్టారని ఆయన పేర్కొన్నారు. త్వరగా పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులు, మున్సిపల్ పాలకవర్గం చర్యలు చేపడుతోంది. ఈ కార్యక్రమంలో సిఐ సైదా, ఎస్సై బాలరాజు, మున్సిపల్ కౌన్సిలర్ లు గజవాడ నాగరాజు గుప్తా, దేవుని రంజిత్, కొక్కు ప్రవీణ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సరాఫ్ యాదగిరి, కాంగ్రెస్ పార్టీ నాయకులు పోచమ్మల గణేష్, పచ్చంటి రాము, యాదగిరి, చింతల స్వామి, బిజెపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రాగి రాములు, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు చింతల శేఖర్, బిజెపి సీనియర్ నాయకులు నవాత్ రాజేంద్రప్రసాద్, అక్కన్నపేట సర్పంచ్ బక్కయ్య గారి యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

# మంచిర్యాలలో టీచర్ల కొరత.. చదువులకు గండి!..





- వినతిపత్రం తిరస్కారం.. విద్యార్థి నేతలకు అవమానం!..
- అధికారి తీరుపై విద్యార్థి నేతల ఫైర్..
- విద్యార్థుల భవిష్యత్తుపై నిర్లక్ష్యం!..
- టీచర్ల కొరతతో చదువులకు గండి!..
- వినతిపత్రం గుమ్మానికే!..
- చర్యలు లేకుంటే..ఉద్యమానికి సిద్ధమన్న విద్యార్థి నేతలు!..

**మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఆగస్టు 13 (సిరి న్యూస్)**

విద్యార్థుల భవిష్యత్తు కోసం గళమెత్తిన విద్యార్థి సంఘాల నాయకులకు జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో అవమానకర అనుభవం ఎదురైంది. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు తగ్గట్టుగా ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలని, మౌలిక వసతులు కల్పించాలని కోరుతూ వినతిపత్రం అందజేయడానికి వెళ్లిన నాయకులను అధికారులు ఘోరంగా అవమానించిన ఘటన జిల్లాలో సంచలనం రేపింది. జిల్లా విద్యాశాఖ అధికారి అందుబాటులో లేని వేళ, సహాయ సంచాలకులు (ఏ.డి.) వినతిపత్రం స్వీకరిస్తారని సిబ్బంది చెప్పడంతో నాయకులు వారి చాంబర్‌కు వెళ్లారు. అయితే అక్కడ జరిగిన పరిణామం విద్యార్థి సంఘాలను దిగ్భ్రాంతికి గురిచేసింది, వినతి పత్రాన్ని స్వీకరించేందుకు ఏ.డి. నిర్మొహ మాటంగా నిరాకరించడమే కాక, టీచర్ల సమస్యల గురించి మీకెందుకు? అంటూ దురుసుగా, అవహేళనగా మాట్లాడారని నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. చివరకు ప్రజా సమస్యపై ఇచ్చిన వినతి పత్రాన్ని కార్యాలయ ద్వారానికి అతికించాల్సిన దుస్థితి ఏర్పడటం అధికారుల నిర్లక్ష్య వైఖరికి అద్దం పడుతోందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి..

**ఒకే శాఖ, ఒకే సమస్య, మరి తిరస్కరణ ఎందుకు?..**

జిల్లా విద్యాశాఖ ఒక్కటే అయినప్పుడు, విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్య కూడా ఆ శాఖకు సంబంధించినదే అయినప్పుడు, సదరు అధికారి వినతిపత్రాన్ని స్వీకరించక పోవడం ఎంతమాత్రం సమంజసం కాదని నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి బాధ్యతారాహిత్యంతో వ్యవహరించే అధికారులను వెంటనే సస్పెండ్ చేయాలని, లేనిపక్షంలో ఇలాంటి నిర్లక్ష్య ధోరణి వల్ల పేద, మధ్యతరగతి విద్యార్థుల భవిష్యత్తుకు తీవ్ర ముప్పు వాటిల్లుతుందని నాయకులు నేరుగా ప్రభుత్వానికే హెచ్చరిక పంపారు. ప్రజా సమస్యలపై వచ్చిన వినతిపత్రాలను స్వీకరించడం కనీస బాధ్యత అని, దానికి విముఖత చూపే అధికారులు పదవిలో కొనసాగడానికి అనర్హులని ఘాటుగా వ్యాఖ్యానించారు..

**విద్యార్థుల చదువుకు గండి కొడుతున్న సిబ్బంది కొరత..**

మంచిర్యాల జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు తగినంతమంది ఉపాధ్యాయులు లేకపోవడం వల్ల చదువులు తీవ్రంగా దెబ్బతింటున్నాయని నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. మొదటి సంగ్రహణాత్మక పరీక్షలు (SA-1) ఇప్పటికే పూర్తవుతున్న తరుణంలో సైతం, పలు పాఠశాలల్లో పాఠ్య ప్రణాళిక ప్రకారం బోధన సాగకపోవడంతో విద్యార్థులు విద్యాపరంగా వెనుకబడిపోయే ప్రమాదం పొంచి ఉందని హెచ్చరించారు. ఇది కేవలం నిర్లక్ష్యం కాదని, పేద, మధ్యతరగతి విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకోవడమేనని తీవ్రస్థాయిలో మండిపడ్డారు..

**అధికారుల నిర్లక్ష్యంపై ప్రభుత్వానికి నేరుగా హెచ్చరిక..**

విద్యార్థుల సమస్యలను వెంటనే పరిష్కరించాల్సిన బాధ్యత గల విద్యాశాఖ అధికారులే ఇలా నిర్లక్ష్యంగా వ్యవహరించడం శోచనీయమని నాయకులు మండిపడ్డారు. తక్షణమే ఉపాధ్యాయులను సర్దుబాటు చేయడంతో పాటు, జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో సురక్షితమైన తాగునీరు, సరిపడా మరుగుదొడ్లు, నాణ్యమైన తరగతి గదులు, ప్రహరీ గోడలు, అవసరమైన ఫర్నిచర్ వంటి కనీస మౌలిక వసతులు వెంటనే కల్పించాలని తీవ్ర స్వరంతో డిమాండ్ చేశారు. బాధ్యతారాహిత్యంగా వ్యవహరించే అధికారులపై చర్యలు తీసుకోకుండా ప్రభుత్వం మిన్నకుంటే, పెద్ద ఎత్తున ఉద్యమానికి సిద్ధమవుతామని నాయకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో చిప్పకుర్తి శ్రీనివాస్, తెలంగాణ విద్యార్థి ఉద్యమ వేదిక రాష్ట్ర కార్యదర్శి చేరాల వంశీ, జాతీయ విద్యార్థి సమైక్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బచ్చలి అభిరామ్, నేషనల్ స్టూడెంట్ కాంగ్రెస్ మంచిర్యాల జిల్లా అధ్యక్షులు అవునూరి ప్రసాద్, అంబేడ్కర్ స్టూడెంట్ ఫెడరేషన్ మంచిర్యాల జిల్లా అధ్యక్షులు వేణు, పవన్ కళ్యాణ్ తదితర విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు..

# పేదల సొంతింటికి కలకు రేవంత్ శ్రీకారం..

- పేదల సొంతింటి కలకు సీఎం రేవంత్ శ్రీకారం..
- రూ.43.20 కోట్లతో 480 ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ..
- కూకట్‌పల్లిలో 4 టవర్లు.. ఒక్కో టవర్‌లో 120 ఇళ్లు..
- 528 చదరపు అడుగుల్లో ఆధునిక వసతులతో గృహాలు..

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఆగస్టు 13 ( సిరి న్యూస్**

హైదరాబాద్ మహానగరంలో పేద, మధ్య తరగతి వర్గాల చిరకాల స్వప్నమైన సొంతింటి కలను నెరవేర్చే దిశగా రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. కూకట్‌పల్లి కేపీహెచ్‌బీ కాలనీలోని సీయూఆర్‌ఈ ప్రాంతంలో నిర్మించనున్న ఇందిరమ్మ గృహ సముదాయానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గురువారం అట్టహాసంగా భూమిపూజ నిర్వహించి శంకుస్థాపన చేశారు. నగర నడిబొడ్డున, కేపీహెచ్‌బీ 9 ఫేజ్ గోకుల్ ప్లాట్స్ వద్ద ప్రభుత్వ స్థలంలో ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టు రూపుదిద్దుకోనుంది..

**రూ.43.20 కోట్లతో నాలుగు టవర్లు.. 480 ఇళ్లు..**

ఈ మెగా ప్రాజెక్టులో భాగంగా నాలుగు భారీ భవనాలను నిర్మించనున్నారు. ఒక్కో భవనంలో పది అంతస్తుల్లో 120 చొప్పున మొత్తం 480 ఇళ్లను నిర్మించి, పేద కుటుంబాలకు అందజేయనున్నారు. హైదరాబాద్ వంటి ప్రధాన నగరంలో స్థలం, ధరలు ఆకాశాన్నంటుతున్న తరుణంలో ఇంత భారీ స్థాయిలో పేదలకు ఇళ్లు నిర్మించడం విశేషంగా చర్చనీయాంశమైంది..

**528 చదరపు అడుగుల్లో పక్కా వసతులు..**

ఒక్కో ఇంటిని 528 చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించనున్నారు. హాలు, పడకగది, వంటగది వంటి కనీస సౌకర్యాలతో పాటు ఆధునిక వసతులతో ఈ గృహాలను తీర్చిదిద్దాలని అధికారులు ప్రణాళిక రూపొందించారు. నగర



నడిబొడ్డున ఇంత విశాలమైన ఇళ్లు అందుబాటు ధరల్లో లభించడం లబ్ధిదారులకు వరంగా మారనుంది.

**పేదల కోసమే ఈ ప్రభుత్వం.. సీఎం రేవంత్ వ్యాఖ్యలు..**

శంకుస్థాపన కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ, పేద కుటుంబాలు సొంతింటి కోసం ఏళ్ల తరబడి ఎదురుచూసే దుస్థితి ఇకపై ఉండ కూడదని స్పష్టం చేశారు. హైదరాబాద్ వంటి మహానగరంలో అందుబాటు ధరల్లో గృహాలు నిర్మించి, పేదల సొంతింటి కలను సాకారం చేయడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఇందిరమ్మ టవర్స్ ద్వారా పేద కుటుంబాలకు భద్రతతో కూడిన, గౌరవప్రదమైన జీవనం అందించేందుకు ప్రభుత్వం కంకణం




కట్టుకుందని తెలిపారు. నగరీకరణ వేగంగా జరుగుతున్న ప్రస్తుత తరుణంలో పేదలు నగర శివార్లకు వెళ్లిపోకుండా, నగరంలోనే గౌరవప్రదమైన నివాసం కల్పించడమే తమ ప్రభుత్వ విధానమని ఆయన అభిప్రాయపడ్డారు..

**స్థానికంగా హర్షం..లబ్ధిదారుల్లో ఆనందోత్సాహాలు..**

కూకట్‌పల్లిలో ఇందిరమ్మ టవర్స్‌కు శంకుస్థాపన జరగడంతో స్థానికంగా హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. దశాబ్దాలుగా సొంతింటి కల కోసం ఎదురుచూస్తున్న పేద కుటుంబాలు ఈ ప్రాజెక్టుతో తమ కల నెరవేరనుందని సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, మంత్రులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు..

**కూకట్ పల్లి నియోజకవర్గం లో గృహ నిర్మాణ రంగానికి ఊపు..**

ఈ ప్రాజెక్టు పూర్తయితే నగరంలో పేదల గృహ వసతి కల్పనలో ఇది ఒక మైలురాయిగా నిలవనుందని అధికార వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. రాబోయే రోజుల్లో నగరంలోని ఇతర ప్రాంతాల్లో సైతం ఇలాంటి ఇందిరమ్మ గృహ సముదాయాలను నిర్మించే యోచనలో ప్రభుత్వం ఉన్నట్టు తెలుస్తోంది. మొత్తంగా కూకట్‌పల్లి ఇందిరమ్మ టవర్స్ ప్రాజెక్టు నగర పేద, మధ్యతరగతి వర్గాల్లో కొత్త ఆశలు రేకెత్తిస్తోంది..

# జొన్నరొట్టెలు తింటే ఎన్ని ప్రయోజనాలో!



**ఆధునిక కాలంలో ఫాస్ట్ ఫుడ్‌కు అలవాటు పడ్డ జనం.. మళ్లీ మన సాంప్రదాయ వంటల వైపు చూస్తున్నారు. నాడు మన పెద్దలు ఎంతో ఆరోగ్యమైన ఆహారం తిని 90 ఏళ్ల వరకు ఆరోగ్యంగా బతికితే నేడు జంక్ ఫుడ్ తింటూ ఈ తరం వాళ్లు 30 ఏళ్లకే ఎన్నో రోగాలబారిన పడుతున్నారు. ఈ నేపథ్యంలో మన పెద్దలు తిన్న జొన్న రొట్టెలపై పల్లె నుంచి పట్నం వరకు ఆసక్తి చూపుతున్నారు. ఆరోగ్యానికి ఎంతో శ్రేయస్కరమైన ఈ జొన్న రొట్టెల గురించి తెలుసుకుంటే మీరు కూడా వదిలి పెట్టరు. డైలీ రొటీన్ లో తినాల్సిన ఆహారంగా మార్చుకోవాల్సిన జొన్న రొట్టెల గురించి తెలుసుకుందాం రండి...**

జొన్నరొట్టెల్లో ఉన్న పోషకాలు, ఆరోగ్య ప్రయోజనాలు ఎంతో విలువైనవి. జొన్నలలో ప్రోటీన్లు, పీచు, పిండిపదార్థాలు, విటమిన్లు, కాపర్, ఐరన్, మెగ్నీషియం, పొటాషియం, కాల్షియం, జింక్, మాంగనీస్, సెలేనియం వంటి పోషకాలు పుష్కలంగా ఉంటాయి. జొన్నల్లో విటమిన్ బి, బి3లు శక్తిని అందిస్తాయి. ఎనీమియాతో బాధపడేవారు జొన్న ఆహారం తీసుకోవడం వల్ల తక్షణ లాభం పొందవచ్చు. మధుమేహం ఉన్నవారు కూడా జొన్నలు వాడవచ్చు, ఎందుకంటే ఇవి కొలెస్ట్రాల్ స్థాయిని పెంచవు. బరువు తగ్గాలనుకునే వారు జొన్నరొట్టెలు తీసుకోవడం ఉత్తమం. జొన్నల్లో యాంటీ ఆక్సిడెంట్లు, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ, మరియు యాంటీ క్యాన్సర్ గుణాలు కూడా ఉన్నాయి, ఇవి వ్యాధులను నిరోధిస్తాయి. జొన్నలతో తయారు చేసిన ఆహారం ఎముకలను బలంగా ఉంచుతుంది, వెన్ను దృఢంగా ఉంటుంది, నడుం నొప్పులు తగ్గుతాయి. బి6 విటమిన్ నరాల వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది, ఉద్వేగాలను నియంత్రించడంలో సహాయపడుతుంది,శరీరంలో రక్త ప్రవాహాన్ని మెరుగుపరుస్తుంది. జీర్ణవ్యవస్థ కూడా మెరుగుపడుతుంది, మలబద్ధక సమస్యలు తలెత్తవు. బరువు తగ్గాలనుకునే వారు జొన్నలతో చేసిన ఆహారం చాలా ఉపయోగకరమైంది. జొన్నలతో మనం సాధారణంగా తినే రొట్టెలతో పాటు ఉప్మా, పొంగల్, పూరీ, ఊతప్పమ్, ముధియాస్, షీరా, తాలీపీఠ్, గోల్‌పాప్డీ, ప్యాన్‌కేక్, ప్యాజ్ కీ రోటీ, బ్రెడ్ స్టిక్స్ వంటి వందకు పైగా రకాల వంటకాల్ని తయారు చేయవచ్చు. ఇవి ఆరోగ్యకరంగా ఉంటాయి, రుచిగా కూడా ఉంటాయి. జొన్నఅన్నం వరి కంటే చాలా మంచిది. ఇంకెందుక ఆలస్యం... మీ రోజువారీ ఆహారంలో జొన్నలను చేర్చుకోండి మరి!

# మంచి ఆహారంతోనే 'పొట్ట' పదిలం!

**మనం రోజూవారీగా తీసుకునే ఆహారం మన ఆరోగ్యాన్ని ఎంతో ప్రభావితం చేస్తుంది. ఈ క్రమంలో మనం ఏది పడితే అది తిని మన పొట్టను ఇబ్బంది పెట్టడం ఎంతమాత్రం సరికాదు. మన రోగ నిరోధక వ్యవస్థ బాగుండాలన్నా, మనం ఉత్సాహంగా మన పనులు చేసుకోవాలన్నా మన జీర్ణ వ్యవస్థ సక్రమంగా ఉండాలి. దీని కోసం మంచి ఆరోగ్యకరమైన అలవాట్లు పాటించడం అవసరం.**



### ఫైబర్‌తో ఎంతో మేలు:

ఫైబర్ అధికంగా ఉండే ఆహారాలు పొట్టకు ఎంతో శ్రేయస్కరం. మొరంగడ్డ, పాలకూర, బీట్‌రూట్, క్యారట్ లాంటి ఆహారాల్లో ఫైబర్ అధికంగా ఉంటుంది. తాజా పండ్లలో కూడా ఫైబర్ అధికంగా ఉంటుంది. ఫైబర్ జీర్ణవ్యవస్థను ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడుతుంది, మలబద్ధక సమస్యలను నివారిస్తుంది.

### ప్రొబయోటిక్ పదార్థాలు:

యోగర్ట్, పెరుగు వంటి ప్రొబయోటిక్ పదార్థాలు పొట్టలో మంచి బ్యాక్టీరియా అభివృద్ధికి సహాయపడతాయి. వీటితో పొట్టలో ఉన్న మంచి సూక్ష్మజీవులు పెరిగి, జీర్ణవ్యవస్థను మెరుగుపరుస్తాయి.

### మొలకలు :

మొలకలు కూడా మన రోజూవారీ భోజనంలో ఉండేలా చూసుకోవాలి. నాన బెట్టిన మొలకలతో ప్రోటీన్లు సమృద్ధిగా అందుతాయి.మనకు కావాల్సిన ఎన్నో పోషకాలను పొందవచ్చు.

### వ్యాయామం:

వ్యాయామం శరీరాన్ని మాత్రమే కాకుండా పొట్టను కూడా ఆరోగ్యంగా ఉంచుతుంది. ప్రతిరోజూ కొంత వ్యాయామం చేస్తే, జీర్ణవ్యవస్థ మెరుగుపడుతుంది.

### మానసిక ఆరోగ్యం:

పొట్టను 'రెండో మెదడు' అని పిలవడం అతిశయోక్తి కాదు. మన ఆరోగ్యం పొట్టమెదడు అనుసంధానంపై ఆధారపడి ఉంటుంది. మానసిక ఒత్తిడిని తగ్గించడం, చక్కగా నిద్రపోవడం, మానసిక ప్రశాంతత కాపాడుకోవడం కూడా ముఖ్యమే.

### మద్యపానం నివారణ:

అతిగా మద్యం తాగడం పొట్టలోని మంచి సూక్ష్మజీవులకు చెడు చేస్తుంది. కాబట్టి, మద్యపానాన్ని దూరంగా ఉంచడం మంచిది.

### మార్పులు గమనించండి :

మల విసర్జనలో మార్పులు, అసాధారణ బరువు తగ్గడం, మలద్వారం నుంచి రక్తం పోవడం వంటి లక్షణాలను గమనించాలి. ఈ పరిస్థితుల్లో సంబంధిత వైద్యులను సంప్రదించి, సరైన చికిత్స పొందడం ముఖ్యం.



# ఇవి తాగితే స్లిమ్ అవ్వడం గ్యారంటీ'టీ'!

ప్రస్తుత కాలంలో ఎంతోమంది ఎదుర్కొనే సమస్యల్లో అధిక బరువు ఒకటి. అందంగా కనిపించాలన్నా, నలుగురిలో స్పెషల్ గా ఉండాలన్నా స్లిమ్ గా ఉండాల్సిందేనని చాలా మంది అభిప్రాయపడుతున్నారు. ఈ నేపేథ్యంలో కడుపు మాడ్చుకునే వారికి ఆరోగ్య నిపుణులు పలు సూచనలు చేస్తున్నారు. స్థూలకాయాన్ని తగ్గించుకోవడానికి కొన్ని పానీయాలను జీవన శైలిలో జోడించుకోమని సలహా ఇస్తున్నారు. బరువు తగ్గడానికి ప్రయత్నించే ఎంతోమందికి ఈజీగా బరువు తగ్గే మార్గం మీ కిచెన్ షెల్ఫ్‌లోనే ఉందంటూ చెబుతున్నారు. ప్రపంచవ్యాప్తంగా దాదాపు అన్ని వంటకాల్లో ఉపయోగించే సుగంధ ద్రవ్యాలలో పసుపు ఒకటి. కానీ పసుపు మసాలాగా కాకుండా బరువు తగ్గడంలో సహాయపడే కొన్ని అద్భుతమైన ఆరోగ్య ప్రయోజనాలను కూడా కలిగి ఉంటుంది.ముఖ్యంగా స్థూలకాయాన్ని తగ్గించుకోవడానికి పసుపును తీసుకోవడం మంచిది. ముఖ్యంగా స్థూలకాయముండేవారికి సాధారణంగా డయాబెటిస్ ముప్పు ఉంటుంది. పసుపు ఉపయోగించడం వల్ల డయాబెటిస్‌కు చెక్ పెట్టడమే కాకుండా ఆరోగ్యానికి చాలా ప్రయోజనం కలుగుతుంది.. పసుపులో ఉండే ఫెనోల్‌లో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ, యాంటీ ఒబెసిటీ గుణాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి శరీరంలోని వైట్ ఎడిపోజ్ టిష్యూలో వాపు తగ్గించేందుకు పనిచేస్తాయి.



### పసుపు పాలు:

పాలలో కొద్దిగా పసుపు కలిపి తీసుకుంటే బరువు తగ్గడానికి, ఆరోగ్యంగా ఉండటానికి చాలా సహాయపడుతుంది. ఇది జలుబు మరియు దగ్గును నివారిస్తుంది. మీ రోగనిరోధక శక్తిని బలపరుస్తుంది. రాత్రి పడుకునే ముందు ఒక గ్లాసు పసుపు పాలు తాగడం వల్ల ఎంతో ప్రయోజనం ఉంటుంది.

### అల్లంతో పసుపు టీ:

యాంటీ ఆక్సిడెంట్లు, మూలికల గొప్ప మూలమైన అల్లం బరువు తగ్గడానికి ఉపయోగపడుతుంది. తరిగిన అల్లం వేసి నీటిని మరిగించాలి. తరవాత అందులో కాస్త పసుపు వేసి కాసేపు అలాగే ఉంచాలి. దీన్ని వడకట్టవచ్చు..లేదా అలాగే తాగవచ్చు. దీన్ని రోజూ తాగడం వల్ల బరువు తగ్గుతారు. అల్లం ఆకలిని తగ్గించడంలో సహాయపడుతుంది





### తేనెతో పసుపు టీ:

తేనెతో పసుపు టీ బరువు తగ్గించేందుకు సహాయపడే ఓ గొప్ప పానీయం. తేనె ఆకలిని తగ్గించడంలో సహాయపడుతుంది. తేనెలో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు కూడా ఉన్నాయి. ఇవి ఎఫెక్టివ్‌గా బరువు తగ్గడంలో సహాయపడతాయి.

### దాల్చిన చెక్కతో పసుపు టీ:

దాల్చిన చెక్క బరువు తగ్గడానికి చాలా సహాయపడుతుంది. పసుపు టీలో కొంచెం దాల్చిన చెక్కను జోడించడం వల్ల బరువు తగ్గడానికి మరింత మేలు చేస్తుంది.







The imprint line should be printed legibly as Printed by Published by BADHE JAYASHREE on behalf of BADHE JAYASHREE, printed at and published at PLOT NO. 104, KAPIL KAUSALYA APARTMENT, SHILPA CERENY COUNTY VENCHER, POTHIREDDYPALLY, editor BADHE JAYASHREE.